



విద్యార్థినులకు కేక్‌ తినిపిస్తున్న కలెక్టర్‌ వెట్రిసెల్వి

కష్టపడి.. ఇష్టపడి చదవండి

- బాలల దినోత్సవంలో కలెక్టర్‌ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్‌, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో వేడుకలు జరిగాయి. ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్‌ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్‌ వెట్రిసెల్వి ముఖ్య అతిథిగా పాల్గొని బాలలతో కలిసి కేక్‌ కట్‌ చేశారు. కష్టపడి, ఇష్టపడి చదివి విజయం అందిపుచ్చుకోవాలని చిన్నారులకు సూచించారు. విద్యతో పాటు, ఏదోఒక క్రీడలో అభిరుచి పెంచుకోవాలని కోరారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌ సభ్యుడు రాజేంద్రప్రసాద్‌, ఐసీడీఎస్‌ పీడీ పద్మావతి, డీఈవో వెంకట లక్ష్మమ్మ, మునిసిపల్‌ కమిషనర్‌ భానుప్రతాప్‌, డీసీపీవో సూర్యచక్రవేణి, హెచ్‌ఎం కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై సమీక్షించుకోవాలి ..

ఏలూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం చేసే భూసేకరణ పనులను సంబంధిత ఆర్డీవోలు ఎప్పటికప్పుడు తహసీల్దార్లతో సమీక్షించి వేగవంతం అయ్యేలా చూడాలని కలెక్టర్‌ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, పరిశ్రమలు, ఫిషింగ్‌ ఔట్‌లెట్స్‌ ఏర్పాటు తదితర పనులకు సంబంధించి భూసేకరణ అంశాలను గురువారం కలెక్టర్‌ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో జూమ్‌ కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు.



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న ట్రిపుల్‌ ఐటీ డైరెక్టర్‌, అతిథులు

నిత్య విద్యార్థిగా ఉండాలి..

- వరంగల్‌ ఎన్‌ఐటీ మెటలర్జీ విభాగాధిపతి కిశోర్‌బాబు

నూజివీడుటౌన్‌, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌ విద్యార్థులు ఎప్పటి కప్పుడు నూతన ఆవిష్కరణలను తెలుసుకుంటూ నిత్య విద్యార్థిగా ముందుకు సాగాలని వరంగల్‌ ఎన్‌ఐటీ మెటలర్జీ విభాగాధిపతి ఎస్‌.కిశోర్‌ బాబు అన్నారు. ఆర్జీయుకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్‌ ఐటీ క్యాంపస్‌లో జాతీయ మెటలర్జీ దినోత్సవం సందర్భంగా జాతీయ సదస్సును నిర్వహించారు. నూజివీడు ట్రిపుల్‌ ఐటీ డైరెక్టర్‌ అమరేంద్రకుమార్‌ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా ప్రొఫెసర్‌ కిశోర్‌బాబు, జేఎన్‌టీయూ విజయనగరానికి చెందిన ప్రొఫెసర్‌ జి.స్వామినాయుడు, కుశలవ ఇంటర్నేషనల్‌ పరిశ్రమ డైరెక్టర్‌ వై.గోపాలరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ మెటలర్జీ విభాగంలో నూతన ఆవిష్కరణలను, పురోగతిని అందిపుచ్చుకోవాలన్నారు. మెటలర్జీ విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు, డీన్‌ రత్నాకర్‌, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా జిల్లా నేతలు..

ఏలూరు సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్‌లకు ఏలూరు జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నేతలను డైరెక్టర్లుగా నియమించారు.

- తూర్పు కాపు కార్పొరేషన్‌కు జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత కరణం పెద్దిరాజు, దెందులూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత లావేటి శ్రీనివాసరావులను నియమించారు.
- క్షత్రియ కార్పొరేషన్‌కు జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన జనసేన నేత పొత్తూరి కృష్ణంరాజు, టీడీపీ నేత ఇందుకూరి రామకృష్ణంరాజు, చింతలపూడి నియోజకవర్గానికి చెందిన నంబూరి రామచంద్రరాజులను నియమించారు.

అది ఇస్తే.. ఇదీ చేస్తాం!



- పార్టీ సభ్యత్వానికి నామినేటెడ్‌ మెలిక
- చాలాచోట్ల సీనియర్లలోను తొంగి చూస్తున్న అసంతృప్తి
- టీడీపీ టార్గెట్‌లో మూడో వంతే పూర్తి
- లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంపీ పుట్టా, గన్ని కార్యాచరణ
- బీజేపీలోను ఇదే వరస

ఎన్నికలు ముగిశాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. కూటమి ప్రభుత్వం ఐదు నెలల క్రితం పగ్గాలు చేపట్టింది. ఇలాంటి తరుణంలో టీడీపీతో సహా మిగతా పక్షాలు క్షేత్రస్థాయిలో తమ పార్టీ మరింత పటిష్టపరిచేం దుకే ఇప్పుడు ఊరూవాడా తిరుగుతున్నాయి. పార్టీలో చేరే వారందరికీ బీమా సౌకర్యం కల్పి స్తున్నాయి. కష్టం వచ్చినా, నష్టం వచ్చినా అండగా మేమున్నామంటూ భరోసా ఇస్తున్నా యి. టీడీపీ ఆది నుంచి కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించడంలో ముందు వరుసలో ఉంది. అయితే నామినేటెడ్‌ పదవులు దక్కలేదన్న అసంతృప్తి, అసహనం పార్టీ కేడర్‌లో కనిపిస్తోంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

సాధారణంగా ఎన్నికలకు ముందే అన్ని పార్టీల్లోను ఎక్కడాలేని ఉత్సాహం కన్పిస్తుంది. తమ పార్టీ గెలిస్తే తిరుగులేని సేవ చేస్తామంటూ తెగ హామీలు ఇస్తారు. కులం పేరిటో, నగదు పేరిటో వల విసురుతారు. కాని ఎన్నికలైన తర్వాత పార్టీ సభ్యత్వాల కోసం ప్రధాన రాజకీయ పక్షాలన్నింటిలోను చలికాలంలో వేడి పుట్టిస్తోంది. ఉమ్మడి జిల్లాల విభజన అనంతరం కొత్తగా ఏర్పడిన జిల్లాల వారీగా టార్గెట్‌ పెట్టుకుని మరీ రంగంలోకి దిగారు. కూటమిలో తెలుగుదేశం సభ్యత్వ నమోదులో ఉరకలేస్తోంది. రెండేళ్లకొకసారి జరిగే సభ్యత్వ నమోదులో ఆ పార్టీ క్షేత్రస్థాయిలో కొంతమందికి బాధ్యతలు అప్పగించి అనుకున్న లక్ష్యాల మేర సభ్యత్వం పూర్తయ్యేలా ప్రతిసారి జాగ్రత్తపడుతూ వస్తోంది. ఈసారి కూడా టీడీపీ మిత్రపక్షాలు గెలిచిన నియోజకవర్గాల్లోను సభత్వ నమోదుకు ఎటువంటి ఢోకా లేకుండా చూసేందుకు ఇప్పటికే జాగ్రత్తలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా సరాసరిన నాలుగు లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకునేలా లక్ష్యాన్ని పార్టీ నేతల ముందుంచింది. ఈనెల 16వ తేదీతో సభ్యత్వ నమోదు పూరికావాలని గత నెలలోనే పార్టీ అధిష్ఠానం నిర్దేశించింది. ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలవగా, మిగతా మూడు చోట్ల జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు కైవశం చేసుకున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు టీడీపీ లక్షన్నరకు పైగానే పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి చేయగలిగింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుకున్న లక్ష్యం చేరేందుకు పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో పాటు ఎంపీ పుట్టా మహేశ్‌ కుమార్‌ యాదవ్‌లకు కొంత బాధ్యత అప్పగించింది. దీంతో తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఎంపీ పుట్టా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు గన్నిని వెంటపెట్టుకుని మరీ నియోజకవర్గాల వారీగా ప్రతీ రోజూ పర్యటించేలా కార్యాచరణ రూపొందించుకున్నారు. అనుకున్న లక్ష్యం సాధించాలంటే మరో రెండున్నర లక్షల మందిని పార్టీలో సభ్యులుగా చేర్చాలి. ఈ క్రమంలో ఏ నియోజకవర్గాన్ని వదిలిపెట్టకుండా మిత్రపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లోను పార్టీ సభ్యత్వాన్ని చురుగ్గా నిర్వహించేందుకు పరుగులు పెడుతున్నారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటే ఒనగూరే ప్రయోజనాలను పార్టీ నాయకులంతా జనం చెవిన వేశారు. ఇప్పుడు తాజాగా జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న పోలవరం, ఉంగుటూరుతోపాటు బీజేపీ ఎమ్మెల్యే ఉన్న కైకలూరులోను పార్టీ సభ్యత్వం మెరుగ్గా నమోదయ్యేందుకు పుట్టా మహేశ్‌, గన్ని శరవేగంగా అడుగులు వేస్తున్నారు.

వాస్తవానికి ప్రతిసారి సభ్యత్వ నమోదులో దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి చింతమనేని ప్రభాకర్‌దే పైచేయిగా ఉంటుంది. ఆ నియోజకవర్గంలో ఉన్న పక్కా నాయకత్వం ఈ వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు సరి చేసుకుంటుంది. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు సభ్యత్వ నమోదు భారీగా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదే తరుణంలో కిందిస్థాయి నేతలు, సీనియర్‌ కార్యకర్తల్లో కొంతమేర ఉత్సాహం తగ్గినట్టు కనపడడం నేతలను కలవరపెడుతోంది. నామినేటెడ్‌ పదవుల్లో తమకు, తమ ప్రాంతానికి ప్రాతినిధ్యం దక్కడం లేదన్న భావనలోనే పార్టీ నేతలు ఉన్నారు. జిల్లాకు సంబంధించి బొరగం శ్రీనివాస్‌కు కార్పొరేషన్‌ చైర్మన్‌ పదవి ఇవ్వగా, జనసేన నేత అప్పలనాయుడుకు ఆర్టీసీ రీజనల్‌ చైర్మన్‌ పదవి దక్కింది. మరికొంతమందికి డైరెక్టర్‌ పదవులు వరించాయి. ప్రత్యేకించి కొన్ని నియోజక వర్గాలకు కనీసం డైరెక్టర్‌ పదవులు కేటాయించలేని పరిస్థితి. ఇప్పటికే పార్టీ కోసం కష్టపడ్డామని, ఆర్థికంగా కొంత కష్టనష్టాలు భరిం చామని, అయినా తమకు న్యాయం ఎందుకు చేయడం లేదని కొందరు ఆక్రోశిస్తున్నారు. పార్టీలో సీనియర్లుగా ఉన్న అనేక మంది తమకు అవకాశం ఉండదని మదనపడుతున్నారు. పార్టీ మాత్రం కష్టపడిన వారెవ్వరికీ అన్యాయం జరగదని చెబుతున్నా అత్యధికులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. అయితే పదవులు తక్కువ, ఆశించే వారు ఎక్కువ ఉన్న తరుణంలోఈ పరిస్థితి ఏర్పడిందని నచ్చచెబుతున్నా కొందరు తీవ్ర ఆవేదనలోనే ఉన్నారు. ఇదంతా పార్టీ సభ్యత్వ నమోదును ప్రభావితం చేసింది. అయితే వీరందరికీ నచ్చచెప్పి అనుకున్న లక్ష్యం అధిగమించాలన్న తాపత్రయం జిల్లా పార్టీలో ఉంది.

సర్దుబాటు చేస్తారా..

నియోజకవర్గాల వారీగా కూటమి ఎమ్మెల్యేలు ఘన విజయం సాధించినా క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదులో టీడీపీతో పాటు బీజేపీ బలంగానే పోటీ పడుతోంది. జిల్లాలో బీజేపీ ఇప్పటికే దాదాపు లక్షా 11 వేల సభ్యత్వంతో కాస్తంత ముందువరుసలోనే ఉంది. వాస్తవానికి బీజేపీ ఎప్పుడు సభ్యత్వ నమోదుకు దిగినా ఆశావహంగా నమోదు పెరిగేదేకాదు. ఈసారి కొంత నమోదులో ఉరుకులు పరుగులు పెడుతున్నా ఏలూరు ఎంపీ స్థానం తపనా చౌదరికి దక్కకపోవడంతో ఆ ప్రభావం కూడా ఏలూరు జిల్లాలో బీజేపీపై కనిపిస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు సర్దుబాటుకు బీజేపీ నేతలంతా ఇప్పుడు ఊరూవాడా తిరగాల్సి వస్తోంది. జనసేన పక్షాన గడిచిన రెండు నెలల క్రితమే సభ్యత్వ నమోదు పూర్తయ్యింది. ఆ పార్టీ కూడా గడిచిన పదేళ్లల్లో ఎన్నడూ లేనంతగా కొంతలో కొంత సభ్యత్వ నమోదును వేలల్లోనే నమోదు చేయగలిగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లక్ష్యంగానే ఆ పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగించింది. దీనికి తోడు తెలుగుదేశం, బీజేపీ, జనసేన పక్షాలు వెనకడుగు వేయకుండా తమ పార్టీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ బీమా వర్తించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో కొంతలో కొంత ఆదరణ పెరిగింది.

సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల అధికారులకు శిక్షణ

ఏలూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌ గోదావరి సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, పోలింగ్‌ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఇరిగేషన్‌ ఎస్‌ఈ సీహెచ్‌ దేవ ప్రకాశ్‌, ఆర్డీవోలు అచ్యుత అంబరీష్‌, ఎం.వెంకట రమణ, ఎం.వాణి పాల్గొన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 253 మైనర్‌ ఇరిగేషన్‌ ట్యాంకులు, 11 మీడియం, 92 మేజర్‌ ఇరిగేషన్‌ ట్యాంకులు మొత్తం 356 సాగునీటి వినియోగదారుల సంఘాలున్నాయన్నారు. కృష్ణా డెల్టా సిస్టంలో ఎనిమిది, గోదావరి డెల్టా సిస్టంలో నాలుగు, నాగార్జున సాగర్‌ ప్రాజెక్టులో 2 కలిపి మొత్తం 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయన్నారు. తమ్మిలేరు, ఎర్రకాల్వకు సంబంధించి రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయన్నారు. ఇరిగేషన్‌ ఎస్‌ఈ దేవప్రకాశ్‌ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ ఉదయం 8గంటలకు ప్రాదేశిక నియోజకవర్గం సభ్యుల ఎంపిక కోసం సమావేశం ప్రారంభించాలన్నారు. ఉదయం 9 గంటలకు ప్రాదేశిక నియోజకవర్గం ఓటు వినియోగానికి వేదిక వద్దకు ఓటు హక్కు కలిగిన రైతులందరినీ అనుమతించాలన్నారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఏకాభిప్రాయం లేని పరిస్థితుల్లో ప్రాదేశిక నియోజకవర్గం సభ్యుల పోస్ట్‌ కోసం పోటీదారుల నుంచి నామినేషన్‌ స్వీకరించాలన్నారు. ఉదయం 10.15 గంటల నుంచి 10.30 గంటలవరకు నామినేషన్ల పరిశీలించి, ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఓటింగ్‌ నిర్వహించాలన్నారు. ఓటింగ్‌ స్లిప్‌ల పంపిణీ ద్వారా ఎంపిక చేయు విధానం , ఓటింగ్‌ స్లిప్‌ తయారీ పంపిణీ, ఓటింగ్‌ బాక్స్‌ తయారీ, ఓటింగ్‌ స్లిప్పుల లెక్కింపు, ఫలితాల ప్రకటన , ఎన్నికల సర్టిఫికేట్‌ జారీ అంశాలను వివరించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు సాగునీటి వినియోగదారుల సంఘానికి అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవడం కోసం ప్రత్యేక మేనేజింగ్‌ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు.

శబరిమలైకు ప్రత్యేక రైళ్లేవి ?

- ఇప్పటి వరకు ప్రకటించని రైల్వే శాఖ
- ఉమ్మడి పశ్చిమలో వేలాదిగా భక్తుల మాలధారణ
- రైళ్ల ప్రకటనపై ఎదురుచూపు



నరసాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):అయ్యప్ప కొండకు వెళ్లే భక్తులకు ఈసారి రైలు ప్రయాణ ఇబ్బందులు తప్పేలా లేవు. విజయవాడ నుంచి కేరళ వెళ్లే రెగ్యులర్‌ రైళ్ల మినహా కొత్త రైళ్లను ప్రకటించలేదు. అవి కూడా నిండుకున్నాయి. దీంతో కొండకు వెళ్లే భక్తులు స్పెషల్‌ రైళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా దీపావళి తర్వాత భక్తులు పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాల ధరిస్తుంటారు. వీరంతా 40 రోజులు దీక్ష చేసి మండల దర్శనానికి వెళ్తారు. ఇక డిసెంబరులో మాల వేసుకున్న స్వాములు మకర జ్యోతి దర్శనానికి వెళతారు. భక్తుల రద్దీని పరిగణనలోకి తీసుకుని మండలానికి, జ్యోతికి వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రతి ఏడాది స్పెషల్‌ రైళ్లను నడుపుతుంది. కొన్ని నరసాపురం నుంచి, మరికొన్ని కాకినాడ, విశాఖల నుంచి వెళతాయి. నరసాపురం, పాలకొల్లు, భీమవరం, కైకలూరు ప్రాంతాలకు చెందిన స్వాములు నరసాపురం నుంచి వెళ్లే ప్రత్యేక రైళ్లను బుక్‌ చేసుకోవడం అనవాయితీ. ఇటు కాకినాడ, విశాఖ నుంచి వెళ్లే రైళ్లలో తాడేపల్లిగూడెం, తణుకు, ఏలూరు ప్రాంతాల స్వాములు రిజర్వేషన్లు చేయించుకుంటారు. ఇవి దొరకని చాలా మంది విజయవాడ నుంచి వెళ్లే రైళ్లను ఆశ్రయిస్తారు. అయితే ఇంత వరకు ఎక్కడ నుంచి ప్రత్యేక రైళ్లను ప్రకటించలేదు. ఇప్పటికే ఢిల్లీ, ఇతర రాష్ట్రాల నుంచి కేరళ వెళ్లే రెగ్యులర్‌ రైళ్లు నిండుకున్నాయి. చాలా మంది స్వాములు వీటిల్లో రిజర్వేషన్‌ చేయించుకున్నారు. మిగిలిన స్వాములు స్పెషల్‌ రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఇంత వరకు వీటి ఊసే లేకపోవడంతో ఈ ఏడాది స్పెషల్‌ రైళ్లు ఉంటాయా ? లేదా ? అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి దేశవ్యాప్తంగా అన్ని డివిజన్లలో రైల్వే నిర్వహణ పనులు చేపడుతోంది. కొన్నిచోట్ల ట్రాక్‌ల అభివృద్ధి, మరికొన్నిచోట్ల డబ్లింగ్‌ లైన్‌, విద్యుద్దీకరణ, సిగ్నల్‌ వ్యవస్థ మెరుగు పర్చడం వంటి పనులు చేపడుతున్నందున చాలా రూట్లలో రైళ్లు రద్దు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ స్పెషల్‌ రైళ్లపై కూడా స్వాముల్లో అయోమయం నెలకొంది. ఇప్పటి వరకు ఎన్ని రైళ్లు శబరిమలైకు నడుపుతామన్న విషయాన్ని ప్రకటించలేదు. విమానయాన సంస్థ మాత్రం భక్తుల కోసం ప్రత్యేక విమానాలు నడుపుతున్నట్లు ప్రకటించింది. స్థోమత ఉన్నవారంతా వివిధ ఎయిర్‌పోర్టుల నుంచి కొండకు వెళ్లి వచ్చేందుకు అడ్వాన్స్‌గా టిక్కెట్లు బుక్‌ చేసుకుంటున్నారు. రైల్వే కూడా ఓ ప్రకటన చేస్తే స్వాముల్లో టెన్షన్‌ తగ్గుతుంది.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు
రూ.25 లక్షల సొత్తు స్వాధీనం
7
నిరుపయోగంగా... ఆక్వా ల్యాబ్‌

పోరుబాట

- సమస్యలు పరిష్కరించకుంటే 25 నుంచి సమ్మె
- 108 అంబులెన్సుల కాంట్రాక్టు ఉద్యోగుల నిర్ణయం
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 230 మంది ఉద్యోగులు



కలెక్టర్‌ వెట్రిసెల్వికి సమ్మెనోటీసు ఇస్తున్న 108 అంబులెన్సుల కాంట్రాక్టు ఉద్యోగులు

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : 'రేయనకా ..పగలనకా.. క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడుతున్నాం. కానీ మా జీవితాలకు, మా కుటుం బాలకు భద్రత లేకుండా పోతుంది. మా సమస్యలు పరిష్కరిస్తేనే మేము విధుల్లో చేరుతాం. లేదంటే ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటాం' అని 108 అంబులెన్సులో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులు ఎనిమిది డిమాండ్లతో సమ్మె నోటీసును బుధవారం కలెక్టర్‌ వెట్రిసెల్వికి అందించారు. ఈనెల 24వ తేదీ లోపు తమ డిమాండ్లను పరిష్కరించకపోతే 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు రాష్ట్రస్థాయిలోనే తీసుకున్న నిర్ణయంతో తాము కూడా సమ్మెలోకి వెళ్తామంటూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 అంబులెన్సులను నిర్వహించాలని, గతంలో హామీ ప్రకారం స్లాబ్‌ల ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఈఎంటీ పోస్టులలో 108 ఈఎంటీలను నియ మించాలన్నారు. పైలెట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా వెయిటేజ్‌ ఇచ్చి నియమించాలన్నారు. ప్రస్తుతం ఉన్న 12 గంటల పని గంటలను 8 గంటలుగా అమలు చేయాలన్నారు. సహజమరణం, ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్‌ నెంబర్‌ 49 ప్రకారం నెలకు నాలుగు వేలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఐదేళ్ల పాటు సర్వీసు ఉంటే గ్రాడ్యూటీ పొందే అవకాశం ఉంటుందని ప్రస్తుతం ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాలుగేళ్లు, నాలుగున్నరేళ్లు వేర్వేరు సంస్థలు కాంట్రాక్టు పొందుతున్నాయని దీనివల్ల తాము నష్టపోతున్నామన్నారు.

ఏలూరు జిల్లాలో 27 మండలాలకు 27 అంబులెన్సులు ఉండగా, ఒక నియోనెటల్‌ అంబులెన్సు ఉంది. 60 మంది పైలెట్లు, 70 మంది ఈఎంటీలు పనిచేస్తున్నారు. మొత్తం 130 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఏలూరు జిల్లాకు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 20 మండలాలకు 20 అంబులెన్సులు ఉండగా ఒక నియోనెటల్‌ అంబు లెన్సు ఉంది. మొత్తం అక్కడ 100 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామంటూ సంబంధిత జిల్లా కలెక్టర్లకు నోటీసులను అందించి విన్నవించుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



పీఎఫ్‌, ఈఎస్‌ఐ, మాకు రావాల్సిన గ్రాడ్యూటీ కాంట్రాక్టు సంస్థలు చెల్లించడం లేదు. 108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి. కొవిడ్‌ లో పనిచేసిన ఇతర ఉద్యోగులకు అదనంగా ఐదు మార్కులు ఇచ్చారు. కానీ మా ఉద్యోగులకు ఒక్క మార్కు కలపడం లేదు. ఉద్యోగులు మరణిస్తే ఖచ్చితంగా రూ.25 లక్షలు చెల్లించేలా ప్రభు త్వం ఆదేశాలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

- ఆర్‌.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు, 108 అంబులెన్సుల కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం, ఏలూరు జిల్లా



ఆచంట ఉమా రామలింగేశ్వరాలయంలో వెలిగించిన అఖండ జ్యోతి (ఫైల్)

నేడు ఆచంటలో అఖండ జ్యోతి

» కర్పూర జ్యోతి ప్రజ్వలనకు ఏర్పాట్లు

ఆచంట, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన రామేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం అఖండ జ్యోతి (కర్పూర జ్యోతి) ప్రజ్వలనకు ఆలయ అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం పౌర్ణమి రోజున అఖండ జ్యోతిని వెలిగించడం ఇక్కడ ఆనవాయితీ. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కృత్తిక నక్షత్ర హోమం, మండపారాధన, పూర్ణాహుతి మహానైవేద్యం, దూపసేవ, నిర్వహించి కర్పూర జ్యోతిని వెలిగిస్తారు.

కర్పూర జ్యోతి విశిష్టత

రెండు కేజీల దూదితో చేసిన ఏక ఒత్తి, ఇత్తడి మండిగను గడ్డితో చుట్టి దీప స్థంభంపై ఉంచుతారు. దానిలో నెయ్యిపోసి ఒత్తిని ఉంచి జ్యోతిని వెలిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు వెలిగించిన కర్పూరజ్యోతి జనవరి వరకు నిరంతరం వెలుగుతూనే ఉంటుంది. జ్యోతిని వెలిగించే రోజున జిల్లా నుంచి వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని కర్పూర జ్యోతికి ఆవు నెయ్యి సమర్పిస్తారు. మొదటి రోజునే భక్తులు సమర్పించిన ఆవు నెయ్యి సుమారు 50 కేజీల పైగా ఉంటుంది. ఎప్పటికప్పుడు నెయ్యిని భారీ పాత్రలోకి సేకరిస్తారు. సేకరించని నెయ్యి నిల్వ ముగిసే వరకు జ్యోతి ప్రజ్వరిల్లుతునే ఉంటుంది. ఆచంట గంధర్వ మహల్‌కు చెందిన గొడవర్తి కుటుంబీకులు కర్పూర జ్యోతిని వెలిగించడం ఆనవాయితీ. సుమారు 150 సంవత్సరాల నుంచి గొడవర్తి కుటుంబీకులు కర్పూర జ్యోతిని వెలిగిస్తున్నారు. మహత్తర అఖండ జ్యోతి అరుణాచలం, కాశీ తర్వాత ఆచంటలో మాత్రమే పౌర్ణమి రోజున వెలిగిస్తారు.

కర్పూర జ్యోతి ప్రజ్వలనకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. సుమారు 20 వేల మందికిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, తగిన ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

కార్తీక పౌర్ణమి

నదీస్నానం.. దీపారాధన.. దానం.. జపాలకు ప్రాముఖ్యం



పరమేశ్వరుని జ్యోతి స్వరూపంగా ఆరాధించి వారి అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందే పర్వదినమే కార్తీక పౌర్ణమి. చంద్రుడు కృత్తిక నక్షత్రానికి సమీపంలో సంచరించే రోజు. ఇతర పౌర్ణిమలకు భిన్నంగా ఈ రోజున చంద్రుని వెలుగులు మరింత ప్రకాశవంతంగా ఉంటాయి. హిందూ మత విశ్వాసాల ప్రకారం కార్తీక పౌర్ణమి రోజునే ఈశ్వరుడు త్రిపురాసురుడు అనే రాక్షసుడిని సంహరించాడు. అందుకే దీన్ని త్రిపుర పౌర్ణమి అని కూడా అంటారు.

- ద్వారకాతిరుమల / కామవరపుకోట

కార్తీక పౌర్ణమి శుభఘడియలు

తెలుగు పంచాంగం ప్రకారం కార్తీక పౌర్ణమి నవంబరు 15 శుక్రవారం ఉదయం 6.19 గంటలకు ప్రారంభమవుతుంది. మరుసటిరోజు శనివారం మధ్యాహ్నం 2.58 గంటలకు పూర్తవుతుంది. ఉదయం తిథి ప్రకారం కార్తీక పౌర్ణమిని శుక్రవారం జరుపుకుంటారు. కార్తీక స్నానం, దానం ఉదయం 6.44 గంటల నుంచి 10.45 గంటల వరకూ జరుపుకోవచ్చు.



కార్తీక పౌర్ణమి రోజు నదీస్నానం, దానం, జపాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. కార్తీక పౌర్ణమి రోజు దేవతలు భువికి దిగి వచ్చి గంగా స్నానం ఆచరిస్తారని చెబుతారు. అందువల్ల ఈరోజు నదీస్నానం ఆచరించి దీపాలు నీటిలో విడిచి పెడితే గత జన్మ, ఈ జన్మలో చేసిన పాపాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. కార్తీక పౌర్ణమి అత్యంత మహిమాన్వితమైనదని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజు రుద్రాభిషేకం జరుపుకుంటే సిరిసంపదలు కలుగుతాయంటారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం జరిపిస్తే కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుందని చెబుతారు.

ఉపవాసం ఇలా

కార్తీక మాసంలో చేసే ప్రతీపనికీ అంతర్లీనంగా ఒక ఆరోగ్య ప్రయోజనంఉంటుంది. అందులో ఉపవాసం ఒకటి. ఈనెలలో ఇష్టదైవానికి ఉపవాసం ఉండటం ఎంతో మంచిది. ఉపవాసం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. కార్తీకంలో పగలంతా ఉపవాసం ఉండి రాత్రి భోజనం చేయాలన్నది ఓ నియమం. దీనినే నక్తమ్ అంటారు. పగలు ఆహారం తీసుకోకుండా ఉండే వాళ్లు పాలు, పండుతీసుకోవచ్చు. రాత్రి చంద్రోదయం తర్వాత పచ్చిపాలను నీటిలో కలపి చంద్రునికి అర్ఘ్యం సమర్పించాలి. విష్ణువుకు పూజించిన తర్వాత చలిమిడి, వడపప్పు సహా పంచామృతాన్ని ప్రసాదంగా సమర్పించి ఉపవాసం విరమించాలి.

కార్తీక దీపం ప్రాముఖ్యత

దీపం అంటే అగ్ని, జ్ఞానానికి, ఆనందానికి, సిరిసంపదలకు ప్రతీక. దీపకాంతిలో ఎరుపు, పసుపు, నీలి కాంతులు ముగ్గురమ్మలకు సంతేకంగా నిలుస్తాయి. దీపారాధన వల్ల శివుని అనుగ్రహం లభిస్తుందని నమ్మకం. ఉసిరి చెట్టు కింద దీపారాధన చేస్తే విశేష ఫలం లభిస్తుంది. కార్తీకమాసంలో ప్రతీరోజూ దీపారాధన చేయలేని వారు పౌర్ణమిరోజైనా వెలిగించాలన్నది పెద్దల సూచన. కార్తీక పౌర్ణమినాడు దాదాపు అందరూ



ఉదయం నుంచి ఉపవాసం ఉండి ప్రదోషకాలంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆరోజున కార్తీక దీపం వెలిగించడం వల్ల విశేష ఫలితాలు సమకూరతాయి. శివాలయాల్లో జ్వాలాతోరణం చేస్తారు. దీపం, పండ్లు, నల్లఉప్పు, బియ్యం తదితరాలను పేదలకు దానం చేయాలి. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందివ్వాలి.

కార్తీక పౌర్ణమి చంద్రోదయం

కార్తీక పౌర్ణమి రోజు శుక్రవారం చంద్రోదయం సాయంత్రం 4.51 గంటలకు ప్రారంభమవుతుంది. పురాణాల ప్రకారం చంద్రుడు తమో గుణాన్ని హరిస్తాడు. పూర్ణిమ వెన్నెల ఎంతో ఆరోగ్యకరమైనది. ముఖ్యంగా కార్తీక పౌర్ణమినాడు వెన్నెల్లో పరమాన్నం సిద్ధం చేసుకుని పూజలు పూర్తయిన తర్వాత ప్రసాదంగా తీసుకోవాలి. పగలంతా ఉపవాసం ఉండాలి. ఇలా చేయడం వల్ల జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు తొలగి సుఖసంతోషాలతో జీవిస్తారని నమ్మిక. కార్తీక పౌర్ణమి రోజులక్ష్మీ దేవిని పూజించడం వల్ల శాశ్వతమైన పుణ్యాలు లభిస్తాయని నమ్ముతారు.



స్పోర్ట్స్ కాలమ్

కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

» గురుకుల కళాశాల విద్యార్థుల జోన్ స్పోర్ట్స్

భీమడోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్ కమిషనర్ సెక్రటరీ సునీల్ రాజ్‌కుమార్ అన్నారు. పోలసానపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో జోనల్ -2 స్పోర్ట్స్‌మీట్ గురువారం ప్రారంభమైంది. క్రీడా పతాకావిష్కరణ, గౌరవవందనం అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి అధికారులు పోటీలను ప్రారంభించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడాపోటీలను సునీల్‌రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల పరిధిలోని 29 కళాశాలలకు చెందిన 1050 క్రీడాకారిణిలు, 60 మంది పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి డీసీవో ఎం.భారతి, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ అధికారులు, ప్రిన్సిపాల్ వెంకటరమణ, పీడీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీనియర్ టెన్నిస్ పోటీలు



కాస్మో క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న టెన్నిస్ పోటీలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్స్ జాతీయ స్థాయి 2024 టెన్నిస్ రెండో రోజు గురువారం పలు విభాగాల్లో పోటీలు జరిగాయి. 70 ఏళ్ళ వయసు విభాగంలో కూడా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 45 ఏళ్ల విభాగంలో ఎస్ 1 ఎంవిఎల్ఎన్ రాజు 6-3, 6-2తో పీఎన్ రాజుపై విజయం సాధించారు. వి.వర్మకృష్ణపై కె.రాజేంద్రప్రసాద్ 6-0, 6-2తో విజయం గెలిచారు. రెడ్డి నాగరాజుపై భాస్కరరావు 6-2, 6-1 గెలిచారు. ఎస్ గోపాల్‌రెడ్డిపై ప్రతాప్ రెడ్డి 6-2, 6-0, 70 ఏళ్ళ విభాగంలో సింగిల్స్ కె.రాధాకృష్ణ మూర్తిపై వైవి రామకృష్ణ 6-2, 6-2, సాయి రాంబాబుపై డీఎస్.రావు 2-6, 6-0, టి.సుందర్‌పై డీఎస్ఎన్ రాజు 6-2, 6-2 విజయం సాధించారు.

17న సీనియర్ మహిళల బాస్కెట్‌బాల్ ఎంపికలు

ఏలూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 10వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల బాస్కెట్‌బాల్ ఎంపికలు ఈనెల 17న స్థానిక కస్తూరిబా మున్సిపల్ గరల్స్ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. డిసెంబర్ 6 నుంచి 9 వరకు మార్టేరులోని ఎస్‌వీవీ జడ్పీ హైస్కూల్లో జరగబోయే బాస్కెట్‌బాల్ అంతర్‌జిల్లాల పురుషుల, మహిళల ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9441171933 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫొటో స్టోరీ



విద్యుత్ తీగ.. పచ్చని పాదు..!

కరెంట్ తీగలను అందుకునేందుకు పచ్చని తీగలు పాకుతున్నాయి. అధికారులు పట్టించుకోకుంటే అందరికీ ప్రమాదమే. భీమవరం కతారి నగర్‌లో విద్యుత్ స్తంభం పరిస్థితి ఇది.



సైకిల్‌పై సరదా ఫీట్..!

సైకిల్‌పై కూర్చుని వెళితే మజా ఏముంది. సైకిల్ వెనక నిలబడి వెళితే ఆ సరదానే వేరు. ఏలూరులో పాఠశాల వదిలిన తర్వాత ఇంటికెళుతున్న బాలల సైకిల్ ఫీట్ ఇలా కెమెరాకు చిక్కింది. అప్రమత్తంగా లేకుంటే చిన్నపాటి ప్రమాదం పొంచిఉంటుంది సుమా..!

ఫొటోగ్రాఫర్ / భీమవరం, ఏలూరు

పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ

» రైతుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వ నూతన విధానం

» జిల్లాకు 5 వేల సెక్స్ సార్టెడ్ సెమన్ దోసుల కేటాయింపు

» గేదె, ఆవు పెయ్య జననాలకు ప్రాధాన్యం

పెంటపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం నూతన విధానాలను తీసుకువచ్చింది. కేవలం పాడి రైతులు పెంచుకునే గేదెలు లేదా అవులకు ఆడ పెయ్యలు మాత్రమే పుట్టేవిధంగా కొత్త చర్యలు చేపట్టింది. పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖల ద్వారా సెక్స్ సార్టెడ్ సెమన్ పంపిణీ చేస్తుంది. ఈ డోసులు వేసిన పశువులకు దాదాపు 90 శాతం ఆడదూడలే పుట్టేలా చర్యలు చేపట్టింది. పాడి రైతులకు పాల ఉత్పత్తి పెంచి అదనపు ఆదాయాన్ని సమకూర్చమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇటీవల నిర్వహించిన పశుగణన ప్రకారం జిల్లాలో గేదెలు 1,78,137 ఉండగా, ఆవులు 45,539 ఉన్నట్లు గుర్తించారు.

రెండు డోసులు కేవలం రూ.500

పశువులకు సెక్స్ సార్టెడ్ సెమన్ 2 డోసులు ఇవ్వాల్సి ఉంటుంది. పశువుల గర్భంలోకి గన్ ద్వారా సెమన్ నేరుగా పంపుతారు. మొదటి డోసు ఇచ్చిన 21 రోజుల తరువాత రెండో డోసు కూడా ఇస్తారు. ఈ రెండు డోసుల విలువ రూ 1,350 కాగా సబ్సిడీ రూ 850 పోను రైతులు కేవలం రూ.500 చెల్లించాలి.

గర్భధారణ కాకుంటే డబ్బులు వాపస్

పశువులకు రెండు డోసులు ఇచ్చిన తర్వాత గేదె లేక ఆవు గర్భం దాల్చకుంటే రైతుల వద్ద తీసుకున్న రూ.500 వెనక్కి ఇచ్చేస్తారు. ఒక వేళ ఆడ దూడ కాకుండా మగ దూడ పుట్టిందంటే సబంధిత రైతుకు రూ.250 వెనక్కి ఇస్తారు

40 శాతం అభివృద్ధి

జిల్లాలో గత ఏడాది మొత్తం 1588 డోసులు ప్రవేశ పెట్టారు. అయా గ్రామాలలో రైతులకు అవగాహన కల్గించి గేదెలు, ఆవులకు పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది డోసులు వేశారు. దీంట్లో 40 శాతానికి పైగా అనుకూల ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది మరిన్ని మంచి ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది జిల్లాకు 5 వేల డోసులు వచ్చాయి. ఇప్పటివరకూ గేదెలు, ఆవులకు 1800 డోసులు వేశారు. ఈ ఏడాది 90 శాతం పైగా మంచి ఫలితాలు వస్తాయని అధికారులు భావి స్తున్నారు. గ్రామాలలో రైతులకు అవగాహన కల్గిస్తున్నారు.



పశువులకు గన్‌తో సెక్స్ సార్టెడ్ సెమన్ ఇస్తున్న పశు వైద్యాధికారులు

పెయ్య దూడ జననం



అధికారుల సూచనల ప్రకారం మా గేదెకు నేను సెక్స్ సార్టెడ్ సెమన్ రెండు డోసులు వేయించాను. వేయించిన వెంటనే సూడిదయ్యింది. ఎటువంటి ఇబ్బంది లేదు. నాలుగు నెలల క్రితం మా గేదెకు పెయ్యదూడ పుట్టింది. చాలా ఆరోగ్యంగా ఉంది. ఇటువంటి పథకాల వల్ల పాడిరైతులకు మేలు జరుగుతుంది.

జామి సత్యనారాయణ రైతు, పెంటపాడు

రైతు ఆదాయం పెంచడమే లక్ష్యం



పాడి రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ సెమన్‌తో 90 శాతం పశువులకు పెయ్యలు పుట్టే అవకాశం ఉంది. ప్రతీచోటా ఇప్పటివరుకూ మంచి ఫలితాలు వస్తున్నాయి. రైతులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. పాడి రైతులు ఇటువంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

డాక్టర్ మహేష్, పశువైద్యుడు, పెంటపాడు

వ్యవసాయం - పాడి పరిశ్రమ

భూమి దున్నకుండా.. అధిక దిగుబడి



మొక్కజొన్నలో మంచి ఫలితాలు

చాట్రాయి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు భూమి దున్న కుండా మొక్కజొన్న సాగులో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఖరీఫ్ వరి కోత అనంతరం భూమి తేమగా ఉండగానే తాళ్లతో వరసలు పట్టి పుల్లలతో నేలకు రంధ్రాలు చేసి మొక్కజొన్న విత్తనాలు నాటుతున్నారు. మొలక వచ్చిన తరువాత ఎరువులు, సస్యరక్షణ, నీటి యాజమాన్యం చేపడుతున్నారు. ఈ విధానంలో ఎకరాకు 35 నుండి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో మండలంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

దిగుబడి ఎక్కువ



రబీలో దున్నకుండా మొక్కజొన్న సాగుకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతుంది. దిగుబడి బాగుంటుంది. ఖరీఫ్ వరి సాగులో పెట్టుబడి చేతికి వచ్చినా, మొక్కజొన్నలో లాభాలతో ఊరట పొందుతున్నాం.

మంచిన పూర్ణచంద్రరావు, కోటపాడు

దున్నకుంటే లాభాలు



ఈ విధానంలో మొక్కజొన్న సాగుతో అనేక లాభాలు ఉన్నాయి. దుక్కి ఖర్చు ఎకరాకు రూ 4 వేలు వరకు ఆదా. కూలీల ఖర్చు, నీటి వినియోగం తగ్గుతుంది. పంట త్వరగా కోతకు వస్తుంది.

బి.శివశంకర్, ఏవో చాట్రాయి

సేంద్రియ సాగు రైతుకు లాభం



కలిదిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో పలువురు రైతులు సేంద్రియ సాగుతో లాభాలు ఆర్జిస్తున్నారు. పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువు, వేప పిండి, జీవామృతంతో సాగు చేసి అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెడితే రూ.30 వేల ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు. బ్లాక్ రైస్, చింతలూరి సన్నాలు, మైసూరు మల్లిక జీరా సాంబ రకాలకు మంచి డిమాండ్ ఉంది. కిలో రైస్ రూ.120 వరకు పలుకుతోంది. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత ప్రకృతి వ్యవసాయం విస్తరించే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.



సబ్సిడీ రుణాలు అందించాలి : అంకెం సీతారాం, రైతు

మూడేళ్లుగా మూడు ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేస్తున్నాం. ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి పోను రూ.30 వేలు ఆదాయం వస్తుంది. కూలీల ఖర్చు అధికంగా అవుతుంది. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తే ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తుంది.



లంపిస్కిన్

• ఆవు దూడలను వదలని మహమ్మారి • నాలుగేళ్లుగా సీజనల్ వ్యాధి!

• నిర్మూలన వ్యాక్సిన్ అందుబాటులో లేక రైతుల అవస్థలు

భీమవరం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆవులు దూడలను లంపిస్కిన్ వ్యాధి మహమ్మారిలా పట్టింది. ఆరేళ్ల క్రితం మొదలైన వ్యాధి తరువాతి సంవత్సరం ఆగింది. తిరిగి 2021 నుంచి ఉధృతమైంది. చివరికి ఏటా సీజనల్ వ్యాధిగా లంపిస్కిన్ వ్యాధి ఆవు, దూడలను పట్టిపీడిస్తుంది. వ్యాధి బారిన పడిన కొన్ని ఆవు, దూడలు, గత ఏడాది ఆపై ఏడాది మృత్యువాత పడ్డాయి. వ్యాధి నివారణ మందు లేదు. నాలుగేళ్ల నుంచి దీనిపై దృష్టి సారించిన పశువైద్యాధికారులు ప్రత్యామ్నాయ వైద్యం అందిస్తున్నారు. గొర్రెలు, మేకలకు మశూచికి ఉపయోగించే వ్యాక్సిన్ వేస్తున్నారు. అయినప్పటికీ సీజనల్‌గా లంపిస్కిన్ ఆవు, దూడలపై ప్రభావం చూపుతూనే ఉంది. ఈఏడాది రెండు నెలలుగా ఆవులు, దూడలు లంపిస్కిన్ బారిన పడుతున్నాయి. నివారణ వ్యాక్సిన్ వస్తేనే వ్యాధిని పూర్తిగా కట్టడి చేయడానికి వీలవుతుంది.

చర్మంపై గెడ్డలు.. తరువాత పుండ్లు..

లంపిస్కిన్ వ్యాధి సోకిన ఆవు, దూడల చర్మంపై గెడ్డలు ఏర్పడతాయి. తర్వాత గెడ్డలు పుండ్లుగా మారుతున్నాయి. అవి ఎక్కువగా వస్తే ఒక్కసారి దూడలుగాని, ఆవులయిన మరణానికి దారి తీసే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి ఆవు జాతికే వస్తున్నాయి. పరిసరాల అపరిశుభ్రంగా, వెలుతురు సోకని పశువులశాలలో వ్యాధి సోకుతుందని వైద్యులు అంటున్నారు.

ఇంటి వైద్యం పనిచేస్తుంది..

ఆవులకు లంపిస్కిన్ వ్యాప్తి చెందినప్పుడు ఇంటి వైద్యంతో కొంత వరకు అరికట్టవచ్చు. మేత విషయంలో ప్రొటీన్స్, మినరల్స్ పెట్టాలి. బెల్లం, తవుడు తినిపించాలి. రోజువారీ గ్రాసాన్ని కొంచెం తగ్గించాలి. గడ్డలు, పుండ్లుగా ఉన్న చోట కలబంద, పసుపు కలిపిన మొత్తని పదార్థాన్ని వాటిపై రాయాలి. దాని వలన పుండ్లు త్వరగా మానిపోతాయి. వైద్యులు యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడుతారు. మరి అవసరమైతే సిలైన్ పెడతారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే మరణాల బారిన పడవని వైద్యులు చెబుతున్నారు.

ఇతర పశువులకు దూరంగా ఉంచాలి



లంపిస్కిన్ సోకిన ఆవు, దూడలను ఇతర పశువులను దూరంగా ఉంచాలి. యాంటీబయోటిక్స్ ద్వారా వ్యాధిని తగ్గించవచ్చు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇది అంటువ్యాధి లాంటిది. వైద్యం ద్వారా చాలా వరకు నయం చేయగలగుతున్నాం.

పుండరీబాబు, పశువైద్యాధికారి

ఇబ్బంది పడుతున్నాం



ఆవు, దూడలకే లంపిస్కిన్ సోకుతోంది. వ్యాధి వ్యాపించిన పశువులు చాలా ఇబ్బంది పడుతున్నాయి. కొద్ది నాటు వైద్యం కూడా వ్యాధి నివారణకు ఉపయోగించాం. లేగదూడలకు రావడం వలన కొద్ది ఇబ్బందిగానే ఉంటుంది.

పి.వెంకటేశ్వరరావు, రైతు, భీమవరం మండలం



క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ట్రైనీ, స్థానిక అధికారులు

శివయ్యకు ట్రైనీ అధికారుల పూజలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వర స్వామిని 10 మంది ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రాలను ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అందించారు.

మొగల్తూరు: పేరుపాలెం సాగర తీరాన్ని 10 మంది ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు సందర్శించారు. ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలల సవ్వడిలో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ రాజ్ కిషోర్, ఎంపీడీవో త్రిశూల పాణి, ఇన్‌చార్జ్ ఆర్ఐ నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు శ్రీధరశ్యామ్



శ్రీధరశ్యామ్‌ను అభినందిస్తున్న ఎస్ఆర్‌కేఆర్ కళాశాల సెక్రటరీ నిశాంత్‌వర్మ

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం ఏఐడీఎస్ చదువుతున్న శ్రీధరశ్యామ్ చంద్రబోట్ల ఎంపికయ్యాడు. ఈ సదస్సులో భవిష్యత్ తరాల జనరేషన్‌కు మార్గం చూపడం అనే అంశంపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ తదితరులు అభినదించారు.

ఎవరైనా తాగితే.. ఇకంతే!



ఇదో అందమైన డెకరేషన్ అనుకుంటున్నారా.. ఇదో చెత్త కుప్ప. ఎక్స్‌పెయిర్ అయిన శీతల పానీయాల పెట్టెలు. ఏపీ నిట్ ప్రహరీ ప్రాంతంలో గురువారం ఓ వ్యాపారి తన వద్ద ఉన్న ఎక్స్‌పెయిర్ అయిన శీతల పానీయాల పెట్టెలు తెచ్చి పారేశారు. ఇవి ఎవరైనా పొరపాటున తాగారో అంతే సంగతులు.. మరికొంత మంది కుళ్ళిన ఉల్లిపాయలు, చెత్త ఇక్కడ వేస్తుండటంతో వాహన చోదకులు దుర్గంధానికి ఇబ్బంది పడుతున్నారు.

- తాడేపల్లిగూడెం రూరల్



క్రీడల్లో గొరగనమూడి విద్యార్థుల ప్రతిభ

పాలకోడేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గొరగనముడి స్వామి జ్ఞానానంద హైస్కూల్ విద్యార్థులు 68వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలికలు, అండర్- 17 బాలురు పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వై.హేమలత తెలిపారు. ఈనెల 8 నుంచి 10 వ తేది వరకు విశాఖపట్నం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 నెట్ బాల్ బాల బాలికల పోటీలలో బాలికల విభాగంలో ద్వితీయస్థానం సాధించారని, ఈ జట్టులో డి జోష్నా నాగసాయి, పి.వసుంధర, టి.మహాలక్ష్మి, డి.గీతిక, జి. అనుస్య ఉన్నారు. నెల్లూరు జిల్లాలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన అండర్-17 బాలుర నెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారని ఈ జట్టులో ఎన్.విలియం, కె.హర్ష వర్ధన్, బి.రాజేష్, ఎ.నిఖిల్ వినయ్, కె.లోకేష్, ఎస్.మహేష్ బాబు ఉన్నారని ఆమె తెలిపారు. అండర్ - 14 విభాగంలో డి. జోష్నా నాగ సాయి, జి.సురేష్ బాబు, అండర్ -17 విభాగంలో ఎన్.నిఖిల్ వినయ్, స్టాండ్ బైగా కె.హర్షవర్ధన్ జాతీయ స్థాయి పోటీలకి ఎంపికైనట్లుగా పీడీ ఎన్ విజయలక్ష్మి తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అతిథులుగా విచ్చేసిన గొరగనమూడి సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పొన్నమండ బాలకృష్ణ ఎంపీటీసీ కృష్ణకుమారి, సినీ నటులు శ్రీరామ్ జగన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఎస్ఆర్ సంకుకు నివాళులు



మొగల్తూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరుకు చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్ఆర్ సంకు ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కార్యక్రమాన్ని గురువారం మొగల్తూరులో ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో హైకోర్టు జడ్జి ఆకుల శేషసాయి, పలువురు హైకోర్టు న్యాయవాదులు, నరసాపురం బార్ కౌన్సిల్ ప్రతినిధులు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, నరసాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, స్థానిక ప్రతినిధులు పడవల సత్యానారాయణ, బోణం నర్సింహారావు, పాలారాంబాబు, జోగి పండు, బళ్ళ శ్రీను, పోతురెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గం

పాలకొల్లు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత విద్యార్థి సంఘం (ఎఐఎస్ఎఫ్) పశ్చిమ గోదావరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా యామిని, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సుందర్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నవీన్, లోకేష్, సహాయ కార్యదర్శులుగా లీలాతేజ, నాగ రాజు, కోశాధికారిగా బేబీ, గర్ల్స్ కన్వీనర్‌గా మహి మ, మరో19 మందితో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి ప్రకటించారు.



జిల్లా అధ్యక్షురాలు యమిని, ప్రధాన కార్యదర్శి సుందర్

మద్యం.. సిట్టింగ్

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- దుకాణాల వద్ద సిట్టింగ్ వేస్తున్న మద్యం బాబులు
- పట్టించుకోని అధికారులు

భీమవరం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చిన ప్రభుత్వం మద్యం వ్యాపారం విషయంలో నిబంధనలు ఎవ్వరు అతిక్రమించినా చర్యలు తప్పవంటూ ప్రచారం చేసింది. దానికి తగ్గట్టుగానే గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి వాటి స్థానంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు లాటరీ తీసి కేటాయించింది. ప్రైవేటు వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అధికారులు కూడా గట్టిగానే చెప్పారు. కానీ వారు చెప్పినవన్నీ ప్రచారంగానే సాగుతున్నాయి. మద్యం దుకాణాలు వద్ద భారీగా సిట్టింగ్ ఏర్పాట్లు చేశారు. కొందరు వ్యాపారులు రాత్రి 10 గంటలు తరువాత కూడా విక్రయాలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో 175 మద్యం దుకాణాలు ఏర్పాటు అయ్యాయి. అయితే అవి ఏర్పాటు అయినప్పటి నుంచి కొందరు వ్యాపారులు బెల్టు షాపులకు మద్యాన్ని తరలిస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్నది. దానికి తగ్గట్టుగానే ఎక్సైజ్‌శాఖ అధికారులు నిత్యం ఏదో చోట దాడులు చేసి అరెస్టులు చేసి మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకొంటున్నారు. కొందరు మద్యం వ్యాపారులు చాలా డబ్బులు చెల్లించి దుకాణాలు దక్కించుకున్నామని ఆ సొమ్మును రెండు సంవత్సరాల్లో రాబట్టుకోవాలన్న ఉద్దేశంతో నిబంధనలు తుంగలో తొక్కుతున్నట్లుగా ప్రచారం సాగుతున్నది. ఏది ఏమైనా సమయ పాలన, సిట్టింగ్ రూమ్‌లు, బెల్ట్ షాపులపై అధికారులు పూర్తిస్థాయి నిఘా పెట్టవలిసిన అవసరం ఎంతైనా ఉంది.

మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ రూములకు ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వకపోవడంపై కొందరు మందుబాబులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం కొనుగోలు చేసి చెట్లు, పొలాలు, పొదల్లోను తాగవలిసిన పరిస్థితులు వచ్చాయంటున్నారు. గత ప్రభుత్వం కూడా సిట్టింగ్ రూములు లేకుండా చేసిందని మండి పడుతున్నారు. పోని బార్లకు వెళ్ళి తాగాలంటే క్వార్టర్‌కు 50 నుంచి 80 రూపాయలు వరకు అదనంగా చెల్లించవలిసిన పరిస్థితి. అందు కోసం ప్రస్తుతం ఉన్న మద్యం షాపులు వద్దే బహిరంగంగా దుకాణ యజమానులు వద్దని చెప్పినా కూడా అక్కడే తాగుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.



భీమవరంలోని ఒక మద్యం దుకాణం వద్ద రాత్రి 9గంటలకు మద్యం సేవిస్తున్న దృశ్యం

నిరుపయోగంగా... ఆక్వా ల్యాబ్



- సిబ్బంది కొరత
- రైతులకు అందని సేవలు
- ప్రైవేటు ల్యాబ్‌లే దిక్కు
- కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం వృథా

ఏలూరు టూటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే రొయ్యలు, చేపల సాగులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాదే అగ్రస్థానం. రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడుతూ కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న రంగాల్లో ఆక్వా పరిశ్రమ అత్యంత ప్రధానమైంది. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన అధిక ఉత్పత్తులు సాధించడం కోసం ఆక్వా రైతుల సౌకర్యార్థం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆధునిక పరికరాలతో ఆక్వా ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ఏలూరు, ఆకివీడు, భీమవరంలో ఒక్కో ల్యాబ్‌ను రూ.80 లక్షలతో ఏర్పాటు చేసి వాటిలో రూ.40వేలు చొప్పున అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ల్యాబ్‌లు రైతులకు ఎంతో ఉపయోగపడేవి. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇవి నిర్వీర్యం అయ్యాయి. ఆక్వా పరిశ్రమను అంతగా పట్టించుకోకపోవడంతో ల్యాబ్‌లు నిరుపయోగంగా మారాయి. ఒక్కో ల్యాబ్‌లో నిరంతరం ఫిషరీస్ డెవలప్ మెంట్ అధికారి (ఎఫ్‌డీవో), నిపుణత కలిగిన ఇద్దరు ఉండాలి. కానీ ల్యాబ్‌ల్లో ఒక్కరు కూడా కనిపించడం లేదు. జిల్లా నలుమూలాల నుంచి మట్టి, నీటిని పరీక్షల తీసుకొస్తే తీరా అక్కడ పరీక్షలు చేసేవారు ఉండటం లేదు. ప్రైవేటు ఆక్వా ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు ల్యాబ్ యజమానులు ఇష్టాను సారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇదికాక 2017లో టీడీపీ ప్రభుత్వం రూ.25 లక్షలతో మొబైల్ ల్యాబ్ ప్రారంభించింది. ఈ మొబైల్ ల్యాబ్ ప్రతి రోజు ఒక ఏరియాను ఎంచుకుని అక్కడ చేపల చెరువుల వద్దకు వెళ్లి నీరు, మట్టి పరీక్షలు నిర్వహించి అవసర మైన మందులను సూచించి, సలహాలు ఇచ్చేవారు. ఆ మొబైల్ ల్యాబ్‌ను కూడా వైసీపీ ప్రభుత్వం మూలన పడేసింది. కూటమి ప్రభుత్వం ఆక్వా ల్యాబ్‌లను మళ్ళీ పునరుద్ధరించాలని, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, మొబైల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని రైతులు కోరుకుంటున్నారు.

ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలు

సాధారణ నీటి పరీక్షలు, అమోనియా నైట్రేట్, పాస్ఫేట్, ఐరన్, క్లోరిన్ లాంటి పరీక్షలు, మట్టి పరీక్షల్లో నత్రజని, భాస్వరం తదితర పరీక్షలు, బ్యాక్టీరియా పరీక్షలు, మేతపోషక విలువలైన ప్రొటీన్, కొవ్వులు, ఫైబర్, తేమ, బూడిద, కార్బోహైడ్రేట్ లాంటి పరీక్షలు నిర్వహిస్తారు. చేపలపై తాటాకు తెగులు, తెల్లమచ్చలు, రెడ్ డీసీజ్, సంకుజలగ, సంకుపూత, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారు. రొయ్యలలో తెల్లమచ్చలు, బ్యాక్టీరియా, ఈహెచ్‌పీ వ్యాధులు, పీసీఆర్ తదితర పరీక్షలు నిర్వహిస్తారు.

పీసీఆర్ పరీక్షలకు రూ.800, మైక్రో బయాలజీ పరీక్షలకు రూ.100, సాయిల్ పరీక్షలకు రూ.210, నీటిపరీక్షలకు రూ.100, పోషక విలువల పరీక్షలకు రూ.240 వసూలు చేస్తారు. అయితే పేద రైతులను దృష్టిలో పెట్టుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉచితంగానే పరీక్షలు నిర్వహించింది. ఆపై వైసీపీ ప్రభుత్వం హయాంలో పరీక్షల ఊసే లేకుండా పోయింది.

వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి పని ఒత్తిడి తగ్గించాలి

రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రాజు

భీమవరంటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందికి పని ఒత్తిడి తగ్గించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు డిమాండ్ చేశారు. జియో టాగ్ హౌస్ సర్వే ఈనెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. మరోపక్క వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది బీఎల్వోలుగా పనిచేస్తూ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల ప్రక్రియలో తల మునకలవడం, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ లిస్టులు తయారు చేయడం, ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైస్ మిల్లులు దగ్గర వీఆర్వోలు కస్టోడియన్ ఆఫీసర్లుగా ఉండడం, ఇసుక రీచ్‌ల వద్ద రాత్రులు, పగలు డ్యూటీలు చేయడం వంటి పనులు చేయిస్తూనే మరల అన్యాయంగా వీఆర్వోలను సస్పెండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీఆర్వోలకు ఇసుక రీచ్‌ల దగ్గర డ్యూటీల నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

రీ సర్వే వినతులపై చర్యలు తీసుకోవాలి

అత్తిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రీసర్వే సందర్భంగా నిర్వహించిన వినతులపై రెవెన్యూ సిబ్బంది త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ కోరారు. తహసిల్దార్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్ల, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రీ సర్వే గ్రామ సభలో 871 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కోరారు. శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల నమోదు పైన సమీక్షించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా మండలంలో 2703 మంది నమోదైనట్లు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల ఓటర్ల జాబితా తయారీపై కూడా సమీక్షించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

అత్తిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారికి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంచిలికి చెందిన దేవులూరి సాయిగంగాధర్, లక్ష్మీ భవానీ దంపతులు కల్యాణం జరిపారు. సంఘ అధ్యక్షుడు పట్నాల బాబు, కార్యదర్శి అనుపోజు అప్పలస్వామి, బల్లంకి ఆచారి, పట్నాల నాగరాజు, కృష్ణ, ముదపాక బ్రహ్మజీ, బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

క్లాప్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్లాప్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జువ్వలపాలెంకు చెందిన మంగిన సాయికిరణ్ క్లాప్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నాలుగు నెలలుగా క్లాప్ వాహనాలు నిలుపుదల చేయ డంతో ఉద్యోగం లేక ఎన్ని చోట్లకు తిరిగినా ఉద్యోగం లభించలేదు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. దీనితో సాయికిరణ్ ఇంటి లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ త్నంకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సాయి కిరణ్ ప్రాణాపాయం తప్పింది. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

బుట్టాయగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మర్లగూడెం అటవీ ప్రాంతంలో కల పాల మంగరాజు(22) చెట్టుకు ఉరి వేసుకుని గురువారం మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంకు చెందిన మంగరాజు కుటుంబ కలహాలు వలన ఉరి వేసుకుని మరణించినట్లు తెలిపారు. విషయం తెలుసుకుని ఎస్సై దుర్గా మహేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి శవాన్ని పోస్టు మార్టమ్ కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ ఫిర్యాదు

భీమవరం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తనపై తన తోటి ఉద్యోగురాలిపై ఐదుగురు అసత్య ప్రచారాలు చేస్తున్నారని గుల్లంకివారివీధికి చెందిన పాలపర్తి మౌనిక వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ కృష్ణాజీ తెలిపిన వివరాలు ప్రకారం మౌనిక, ముత్యావతి అనే మహిళలు భీమవరం మెప్మాలో ఆర్పీలుగా పనిచేస్తున్నారు. అయితే మున్సిపాలిటీలో పనిచేస్తున్న నానిబాబు, సంతోషి, జయకృష్ణ, పెద్దింట్లు, వరహాలు అనే వారు గత కొద్ది రోజులుగా మౌనిక, ముత్యావతిలపై వ్యక్తిగత జీవితాల గురించి బురద జల్లే విధంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనేక రకాలుగా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.25 లక్షల సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగను జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ నేరస్తుడి వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబర్ 28వ తేదీన జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో పల్సర్ మోటారు సైకిల్ అపహరణకు గురి కావ డంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. వారికి వచ్చిన సమాచారంతో గాలింపు చేపట్టారు. కామవరపుకోట మండలం పాతకొండగూడెం గ్రామానికి చెందిన అంతర్ రాష్ట్ర నేరస్తుడు చీకట్ల సతీష్ అలియాస్ పండును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి జంగారెడ్డిగూడెంలో తస్కరించబడిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ నెల 2వ తేదీన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగిపాడు గ్రామంలో ఒక ఇంటిలోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించి ఇద్దరు మహిళలను ఇనుపరాడ్‌లతో కొట్టి ఆ ఇంట్లో నుంచి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు నగదు అపహరించు కుపోయారు. ఆ నేరం కూడా చీకట్ల సతీష్ చేసినట్లుగా పోలీస్ విచారణలో వెల్లడై ంది. అతని నుంచి పల్సర్ మోటారు సైకిల్, సాగిపాడులో రోబరీ కేసులో అపహరించబడిన బంగారపు వస్తువు లు మొత్తం నలభైఏడున్నర కాసులు, వెండి వస్తువులు నాలుగు కేజీల 150 గ్రాము లతో పాటు 2,46,150 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 25లక్షల రూపాయల విలువైన చోరీ సొత్తును రికవరీ చేయడం జరిగిందని చెప్పారు. ఈనేరస్తుడిని అరెస్టు చేయ డంలో గణపవరం సీఐ ఎంవి సుభాష్, ఏలూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ బోణం ఆది ప్రసాద్, జంగారెడ్డిగూడెం ఎస్ఐ షేక్ జబీర్, ఐడీ పార్టీ ఏఎస్ఐ ఎంవతి సంపత్, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎస్‌కె షాజహాన్, ఏలూరు సీసీఎస్ కానిస్టేబుళ్ళు నాగరాజు, రజనీ కుమార్‌లు సహకరించారని ఎస్పీ వీరందని అభినందించి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను ఎస్పీ అందించారు.



ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు.. స్వాధీనం చేసుకున్న పరికరాలు

ఏలూరు జిల్లాలో ఎక్సైజ్ దాడులు

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో విస్తృతంగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో సారా స్థావరంపై దాడి చేశారు. భూక్య సోనియా అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 50 లీటర్ల సారా, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో 1000 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న చింతలపూడి మండలం కొవ్వూరుగూడెం గ్రామానికి చెందిన రేపాక గోవర్ధన్‌ను అరెస్టు చేసి 22 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ ఆధ్వర్యంలో చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో యువకుడి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :హత్యాయత్నానికి పాల్పడిన ఒక యువకుడిని ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ అరెస్టు చేశారు. లింగారావుగూడానికి చెందిన నూలు రంగారావును ఈనెల 11వ తేదీ రాత్రి చాకుతో పొడిచి హత్యాయత్నానికి అదే గ్రామానికి చెందిన బొడ్డు వెంకట్ పాల్పడ్డాడు.

ఇద్దరు దొంగలు అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద ఉన్న మోటారును అపహరించిన ఇద్దరు యువకులను ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ మండలం కొమడవోలు గ్రామానికి చెందిన చెల్లూరి సింహాద్రి అప్పన్న ఇంటి వద్ద ఉన్న ఆఫ్‌హెచ్‌పీ మోటారును అదే గ్రామానికి చెందిన చౌటపల్లి నాగసాయి, బాలకిరణ్‌లు అపహరించారు. దీంతో వారిద్దరిని రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గడ్డిలోడు ట్రాక్టరు దగ్ధం

ద్వారకాతిరుమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవినేనివారిగూడెంలో విద్యుత్ వైర్లు తగిలి గడ్డిలోడు ట్రాక్టరు దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు ట్రాక్టరుపై గడ్డిలోడును రామాలయం రోడ్డుమీదుగా తీసుకెళ్తున్నాడు. కిందికి వున్న విద్యుత్‌వైర్లు తగిలి విద్యుత్ మంటలు రేగడంతో ట్రాక్టర్‌లో గడ్డి అగ్నికి ఆహుతైంది. స్థానికులు స్పందించి మంటలను అదుపు చేశారు.

హోం మంత్రిని కలిసిన వెంకటలక్ష్మి



ఏలూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దెందులూరు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన పలు ఘటనల పై జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, హోం మంత్రి వంగలపూడి అనితను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వెంకటలక్ష్మి తెలిపారు.

మార్కెట్ యార్డు అభివృద్ధి చేస్తా

ఏలూరు టూ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మార్కెట్ యార్డు నిమ్మకాయల వర్తకుల సంఘం నాయకులు కలిసి తమ సమస్యలు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నిమ్మకాయలకు మద్దతుధర వచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యేకు రెండెడ్ల బండి నమూనాను రైతులు బహూకరించారు. సీహెచ్ వెంకటరత్నం, రెడ్డి నాగరాజు, ఎం.పార్థసారథి, కిషోర్, చక్రపాణి, రామకృష్ణ, బాలు, మురళీ పాల్గొన్నారు.

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాకార్యవర్గానికి గురువారం ఎన్నికలు జరిగాయి. సంఘ జిల్లా నూతన అధ్యక్షుడిగా కె.వెంకటరమణ, ప్రధానకార్యదర్శిగా టి.ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా యు.గంధర్వరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో సంఘ రాష్ట్ర సహ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ బడి ఉంటేనే మన భవిష్యత్తు నినాదంలో పనిచేయాలని కోరారు. నూతన నాయకులను ప్రకాష్‌రాజ్, వరప్రసాద్, జేమ్స్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కామవరపుకోట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రామన్నపాలెం మారుతీనగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ఏఎంసి మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, టీడీపీ ఏలూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఎం.నాగేశ్వర, రాంబాబు ప్రారంభించారు. టీడీపీ నేతలు జి.రాంబాబు, నాగలింగేశ్వరరావు, ధర్మారావు, గంగాధరరావు పాల్గొన్నారు.

కూటమి నేతల ఆత్మీయ సమావేశం



పోలవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్యక్షతన గురువారం కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. నాయకులు కరిబండ నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, కొణతాల ప్రసాద్, బొడ్డు కృష్ణ, కుంచె దొరబాబు, పరిమి రాంబాబు, జయవరపు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై నిఘా ఉంచండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న నాగ ప్రభుకుమార్

భీమడోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్టుషాపులు, సారా అమ్మకాలుపై నిఘా ఉంచాలని అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్ ఆదేశించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఏఈ నాగ ప్రభుకుమార్ సందర్శించి స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. భీమడోలు సీఐ సత్యనారాయణ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. భీమడోలు స్టేషన్ పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, ద్వారకాతిరుమల, నిడమర్రు మండలాల్లో సారా అమ్మకాలు బెల్టుషాపుల మీద పెట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

తెలంగాణ మద్యం అమ్ముతున్న ఇద్దరు అరెస్ట్

జంగారెడ్డిగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలం శివగిరి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చదల అమరావతి అనే మహిళ నుంచి 30, కోపల బాపూజిరెడ్డి నుంచి ఏడు తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్ట్‌చేసి వారి పై కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు వెంకటలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రిక్వెస్ట్ హాల్ట్ ఏర్పాటు చేయండి

భీమడోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు జంక్షన్, భీమడోలు రైల్వే గేటు సమీపంలో ఆర్టీసీ నాన్‌స్టాప్, స్లీపర్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నిలుపుదల చేసే రిక్వెస్ట్ హాల్ట్ సౌకర్యాన్ని కల్పించాలని మండల జనసేన పార్టీ నాయకుడు ఆర్టీసీ జోన్ రీజనల్ బోర్డు చైర్మన్ రెడ్డి అప్పల నాయుడుకు వినతిపత్రం అందజేశారు. మండల పార్టీ జనసేన అధ్యక్షుడు పి.మదన్ ఆధ్వర్యంలో రెడ్డిఅప్పలనాయుడును కలిశారు. చైర్మన్‌గా ఎంపికైన ఆయనను అభినందించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు బస్సులను నిలుపుదల చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భీమడోలు జంక్షన్ రైల్వే గేటు సమీపంలో బస్సులకు హాల్ట్ కల్పించాలని కోరారు. జనసేన నాయకులు సత్యకృష్ణ, లీలాకృష్ణ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు టూ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరంతరం పుస్తకాలు చదవటం వలన విజ్ఞానాన్ని సంపాదించి ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తకాలు చదివటాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. తాను నిరంతరం పుస్తకాలు చదవటం వలనే ఈ స్థాయికి చేరుకోగలిగానన్నారు. విశిష్ట వ్యక్తుల జీవిత చరిత్రలు, బయోగ్రాఫీలను చదవాలన్నారు. ప్రతి రోజు పుస్తక పఠనం చేస్తానని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగర కమిషనర్ భానుప్రతాప్, గ్రంథాలయ కార్యదర్శి శేఖర్‌బాబు, వయోజన విద్యా ఏడీ ప్రభాకరరావు, తహసీల్దార్ శేషగిరి, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్ కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది. పాల్గొన్నారు. గ్రంథాలయంలోకి ప్రవేశించగానే విజిటర్స్ బుక్‌లో కలెక్టర్ సంతకం చేశారు. అలాగే మహిళా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథపాలకురాలు వై.శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రారంభమాయ్యాయి. మహిళా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు వై.సుశీల, ఎస్.విజయలక్ష్మి, పాల్గొన్నారు.

● పెదవేగి పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంఈవో వి.అరుణ్‌కుమార్ ప్రారంభించారు. జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ ధనలక్ష్మి, గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో తాడేపల్లిగూడెం డీవైఈవో రవీంద్ర భారతి, డాక్టర్ కస్తూరి శిరీష తదితరులు వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. సీనియర్ నాయకులు కె.సర్వేశ్వరరావు, టి.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

● పెదపాడు : గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు ఎంతగానో ఉపయోగపడతాయని, ఎంపీడీవో ఎండీ ఎ.జమ అన్నారు. తొలుత బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకుడు డి.జాన్‌బాబు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్ : స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్.రామ్మోహన్‌రావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేసి పంచారు. నాయకుల బాబూ ప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, ఎం.సాయిప్రసాద్, సాయి మురళీ, సుబ్బారావు పాల్గొన్నారు.

● భీమడోలు : స్థానిక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు రిటైర్డ్ ఎంపీడీవో కోటయ్య భోజనం పేట్లను అందజేశారు. భీమడోలులో ఎంపీడీవో సిహెచ్ పద్మావతి దేవి వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. హెచ్‌ఎం దొర ఉపాధ్యా యులు, పమానందం పాల్గొన్నారు.

● చింతలపూడి, : స్థానిక గ్రంథాలయంలో మునిసిపల్ కమిషనర్ డి.పావని వారోత్సవాలను ప్రారంభించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

● లింగపాలెం : ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాలయాలలో వారోత్సవాలు నిర్వహించారు. అయ్యంకి వెంకటరమణయ్య, నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జి.బుజ్జయ్య, గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటరమణ, ఎస్ఏ లతీఫ్, బి.శ్రీధర్, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

● కామవరపుకోట : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఎంఈవో డి.సుబ్బారావు వారోత్సవాలను ప్రారంభించారు. చిన్నారులను గ్రంథాలయాలకు వచ్చే విధంగా ప్రోత్సహిస్తే వారి భవిష్యత్ బాగుంటుందన్నారు. గ్రంథాలయ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం, గ్రంథ పాలకులు ఎం.భీమరాజు, టీవీఎస్ రాజు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

● టి.నరసాపురం : శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమానికి ఎంపీడీవో ఎస్.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ యూపీ స్కూల్ కరస్పాండెంట్ పి.శ్రీనివాస్, స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు కె.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



టి.నరసాపురంలో ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

టి.నరసాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాపోరు ధర్నాలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కి అందచేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, మండల నాయకులు ఎ.మురళీ, మండల కమిటీ సభ్యులు ఎం.సుధారాణి, ఎం.కుమారి, ఏఎస్ఆర్ నగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం చేపట్టిన ప్రజాపోరులో భాగంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, వి.గోపీ, పి.సూర్యారావు, సూర్యచంద్రం, రాంబాబు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ఆదివాసీలతో కలిసి ధర్నా నిర్వహించారు. అంతకముందు ప్రజా రక్షణ యాత్ర పేరుతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మండల కార్యదర్శి టి.రామకృష్ణ మాట్లాడుతూ నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పి.నాగేశ్వరావు, కె.జలపాలు, ఎం.నాగమణి, టి.ముత్యాలమ్మ, యు.వెంకటేష్ ఆదివాసీలు పాల్గొన్నారు.

● చింతలపూడి : ఇళ్లు లేని పేదవారికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని మండల సీపీఐ కార్యదర్శి కంచర్ల గురవయ్య పేర్కొన్నారు. రేచర్లలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదల నుంచి అర్జీల నమోదు చేపట్టారు. టి.బాబు, డి.కృష్ణ పలువురు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు అండగా ఎంపీ పుట్టా, గన్ని



ప్రమాదంలో గాయపడినవారికి మంచినీటిని అందజేస్తున్న గన్ని, మహేష్‌కుమార్

బుట్టాయగూడెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అండగా నిలిచారు. ప్రమాదంలో గాయపడిన దంపతులను పరామర్శించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనడానికి బుట్టాయగూడెం వస్తుండగా మార్గమధ్యంలో ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో కన్నాపురంనకు చెందిన సరికొప్పుల గంగరాజు అతని భార్య గాయపడ్డారు. కళ్ళముందే ప్రమాదం జరగడంతో స్పందించిన ఎంపీ కారు దిగి దంపతులను పరామర్శించారు. ఎంపీ ఆదేశాలతో వ్యక్తి గత సిబ్బంది బాధితులకు సపర్యలు చేశారు. వాహనం ధ్వంసం కావడంతో క్షతగాత్రులకు కొంత ఆర్థిక సాయం చేశారు. గాయపడినవారిని మరో వాహనంలో ఆసుపత్రికి తరలించారు. కారు వివరాలు సేకరించాలని ఎంపీ పోలీసులను ఆదేశించారు.

టీడీపీ కుటుంబ సభ్యులందరితో సభ్యత్వం చేయించాలి

టీడీపీ చెందిన కుటుంబ సభ్యులందరితోను పార్టీ సభ్యత్వం నమోదు చేయించాలని జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ నాయకులకు తెలిపారు. జి.అబ్బులు ఇంటి వద్ద జరిగిన పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొని పలువురు నాయకులచేత సభ్యత్వం చేర్పించారు. నాయకులు ఎస్ వెంకటేశ్వరావు, జి.శ్రీరామ్మూర్తి, ఎం.సోంబాబు, వై.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

రైల్వే లైను మెట్ట ప్రాంత ప్రజల కల

జంగారెడ్డిగూడెం : ఏలూరు ఎంపీ పుట్టామహేష్ యాదవ్‌ను గురువారం ఆయన క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ రామలింగేశ్వరరావును అభినందించారు. సత్తుపల్లి-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణం మెట్ట ప్రాంత ప్రజల కలని, ఆ కలను నెరవేర్చాలని ఎంపీ మహేష్‌ను కోరారు. సత్తుపల్లి-కొవ్వూరు రైల్వేలైన్ కోసం ఇప్పటికే డీపీ ఆర్ సిద్ధం చేశామని, త్వరలోనే రైల్వే శాఖామంత్రికి సమర్పిస్తామని ఎంపీ తెలిపారు. కె.ఉమాప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

ఏలూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు ఎంతో దోహదపడతాయని ఏలూరు రూరల్ మండలం డివిజనల్ డెవలప్ మెంట్ అధికారి ఏబీవీపీ లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎమ్పీవో వెన్నశ్రీలత అధ్యక్షతన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీలత మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పలు అంశాలపై అధికారులు అనుమానాలు నివృత్తి చేశారు.

● కామవరపుకోట : మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పి.సరళ కుమారి, ఏవో ఎస్.సత్యవేణి, ఎంఈవో ప్రశాంత్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనునాయక్, జీవీ సత్యనారాయణ, వి.రాజేష్, జె.సుబ్బారావు, రత్నకుమారి, నాయక్, శాంతారావు, జి.వి.సత్యనారాయణ, ప్రశాంత్, బాపూజీ, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● లింగపాలెం : గ్రామాలలో అభివృద్ధి పనులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసు కోవాలని ఎంపీడీఓ కె.వాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై నివేదిక తయారు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ జేఎం రత్నకుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : గ్రామాల అభివృద్ధి నిమిత్తం ప్రణాళికల తయారీపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లు డ్వాక్రా మహిళలకు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ శిక్షణ ఇచ్చారు.

● పెదవేగి :స్థానిక ఎంపీడీవో కార్యలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గ్రామాల అభివృద్ధిపై ట్రైనర్ ఆఫ్ ట్రైనీ(టీవోటీ) పి.విజయ్ అవగాహన కల్పించారు. విషయంలో మండలస్థాయి అధికారులనుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు కృషి ఉండాలని సూచించారు. ఈవోపీఆర్డీ షరీఫ్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో కె.జ్యోతి అధ్యక్షతన ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. సదస్సులో పాల్గొన్న ఏపీఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ జి.మరణ ఉపాధి హామీ, గ్రామీణ మంచినీటి పథకం, డ్వాక్రా సంఘాలు ఇతర శాఖల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్దంచేసి అధికారులకు అందజేయాలని తెలిపారు. డీఎల్‌పీవో ఎం.రాజు, అధికారులు, కార్యదర్శులు, వీవోలు పాల్గొన్నారు.

ఉదయపు నడకతో మధుమేహం నియంత్రణ



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ వ్యాధి దినాన్ని పురస్కరిం చుకుని స్థానిక ఆయుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం 10 వేల అడుగుల వాక్‌థాన్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి జెండాఊపి ప్రారంభించారు. సీఆర్ఆర్ కళాశాల క్రీడా మైదానం నుంచి ఆయుష్ ఆస్పత్రి వరకు నడక సాగింది. సీనియర్ సిటిజన్లు, ఉదయపు నడకకు వచ్చిన వారు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులవల్ల డయాబెటిస్ చిన్నవయసులోనే సోకుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఊబకాయం, జంక్‌ఫుడ్, కుటుంబ నేపథ్యం కారణంగా మధుమేహ వ్యాధి విస్తరిస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా ఉదయపు నడకను పాటించాలన్నారు. ఆస్పత్రి వైద్యులు బొప్పన దశరథ్, వెంకట జయదీప్, వంశీ వాక్‌థాన్‌కు హాజరైనవారందరికీ ఉచితంగా హెచ్‌బీఏ1సి, లిపిడ్ ప్రొఫైల్, యూరిక్ యాసిడ్ టెస్టులను చేశారు. ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాన్సి తదితరులు పాల్గొన్నారు

కేన్సర్, బీపీ, షుగర్ స్క్రీనింగ్ క్యాంపు ప్రారంభం



నోటి కేన్సర్ టెస్టు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా కేన్సర్, బీపీ, షుగర్ టెస్టుల స్క్రీనింగ్ క్యాంపులను గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రారంభించింది. స్థానిక తాపీమేస్త్రి కాలనీలోని అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో నోటి కేన్సర్ పరీక్షల నిర్వహణ తీరును డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళలకు సర్వేకల్ కేన్సర్ పరీక్షలకు సచివాలయ వైద్య మిత్రల సహకారాన్ని కూడా తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక వైద్య పరిశీలనల సమగ్ర వివరాలన్నింటినీ నిర్ణీత యాప్‌లో నమోదు చేయాలని, అనుమానిత కేన్సర్ లక్షణాలు కనబడిన మహిళలను తదుపరి నిర్ధారణ పరీక్షలు, చికిత్సల నిమిత్తం గైనకాలజిస్టులు, అంకాలజిస్టుల వద్దకు తీసుకెళ్ళాలని సూచించారు. డీఎంహెచ్‌వో వెంట వైద్య ఆరోగ్య శాఖ అంటు వ్యాధుల నివారణ, నియంత్రణ విభాగం(ఎన్‌సీడీ) సర్వైలెన్స్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఏలూరు క్రైం : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు ఉద్యోగులకు సూచించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని అన్ని విభాగాలను గురువారం ఆయన పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎంఆర్ఐ, సిటీ స్కాన్‌లు ఖచ్చితంగా ఆసుపత్రిలో ఉన్న ఇన్ పేషెంట్లకు మాత్రమే తీయాలని, ఔట్ పేషెంట్లకు తీయవద్దని ఆదేశించారు. బయట ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ కేవలం స్కానింగ్‌ల కోసం ఇక్కడకు వచ్చి ఓపీ తీసుకుని వైద్యులతో ఎంఆర్ఐ సిటీ స్కాన్‌లు రాయించుకుంటున్నట్లు తమ పరిశీలనలో స్పష్టమైందని ఈ విధానానికి స్వస్తి పలకాలన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వీఊఆర్ఎస్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

ఏలూరు రూరల్, నవంబర్14 (ఆంధ్రజ్యోతి): పోణంగిలోని ఏలూరు అర్బన్ లే అవుట్ కాలనీని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సందర్శించారు. హౌసింగ్ నిర్మాణ పనులను పరిశీలించి, హౌసింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణ, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ భానుప్రకాష్, ఏలూరు తహసీల్దార్ శేషగిరి, హౌసింగ్ ఈఈలు, ఏఈలు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

బౌద్ధారామాలకు ఆర్టీసీ బస్సు నడపాలని వినతి

జంగారెడ్డిగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం గుంటుపల్లిలోని బౌద్ధారామాలకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం చంద్రరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. శని, ఆది, సోమవారాల్లో గుంటుపల్లికి సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. వీరమళ్ళ మధు, ఉయ్యూరు సుభాష్, వీరంకి నాగరాజు పాల్గొన్నారు.

వాకర్స్ నూతన కార్యవర్గం

ఏలూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం వార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవ ర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పి.నాగవిఘ్నేశ్వరరావు, కార్యదర్శిగా మాధవరావు, ట్రెజరర్‌గా కె.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా రామకృష్ణను, గౌరవాధ్యక్షుడిగా ఎస్ఎం అక్బర్, జగదీషన్, అడ్వైజర్‌గా ఎస్‌కే సత్తార్, జాలివాకర్‌గా కె.సాంబశివరావును ఎన్నుకున్నారు.

విద్యా సంస్థల్లో బాలల పండుగ



ఏలూరులో బాలల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఇందిరాకాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఆదివారపుపేట ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూల్లో గురువారం జరిగిన బాలల దినోత్సవంలో నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన జి.కృష్ణ, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, ఉజ్వల, ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్(ఎఫ్ఐఎఫ్) రాష్ట్ర కార్యదర్శి హుస్సేన్ టీచర్లు, విద్యా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్/లింగపాలెం/కొయ్యలగూడెం : ఏలూరు రూరల్, లింగపాలెం, కొయ్యలగూడెం మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా బాలలదినోత్సవం నిర్వహి ంచారు. ప్రతిభ గల విద్యార్థులు, చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందించారు. పాఠశాల హెచ్‌ఎం జి.ప్రకాష్, సీహెచ్ రత్నాకర్, బి.శ్రీధర్ ప్రభాకర్ ఉపాధ్యాయులు పీడీ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : స్థానిక శ్లోకా కాన్సెప్ట్ ప్రయివేటు పాఠశాలలో చిన్నారులు నృత్యాలు అలరించాయి. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. కరస్పాండెంట్ ఎం.శ్రీనివాసరావు, పి.మనోజ్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

● చింతలపూడి : బాలల దినోత్సవం సందర్భంగా మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ హైస్కూలును న్యాయాధికారి సి.మధుబాబు సందర్శించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీవో మాధవి, ఎంఈవో కిరణ్‌బాబు, హెచ్‌ఎం సుధాకర్ పాల్గొన్నారు.

● నిడమర్రు : చిననింద్రకొలను జెడ్పీ హైస్కూల్లో బాలల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. హెచ్‌ఎం పీవీ సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం : ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో, శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో, దొండపాడు పరివర్తన విభిన్న ప్రతి భావంతుల పాఠశాలలో బాలల దినోత్సవంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ బి రాధాకృష్ణ, సీడబ్ల్యూసీ మెంబర్ పి.వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కాంతిప్రియ, హోమ్ సూపరిం టెండెంట్ శ్రీవల్లి, రాష్ట్ర బాలల హక్కుల మెంబర్ కె.రాజేంద్ర ప్రసాద్, విభిన్న ప్రతిభా వంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రామ్‌కుమార్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే మద్దిపాటి



స్వామి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని ఆలయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గురువారం ఉదయం సందర్శించారు. తన పుట్టినరోజు కారణంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు మన స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు స్వామి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు.

రేపు న్యాయ విజ్ఞాన సదస్సు

దెందులూరు,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మహిళలకు, బాలికలకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు.

నేడు బైక్ ర్యాలీ

దెందులూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన ఆరు శివాలయాలను దర్శించుకునేందుకు రామదండు ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని దెందులూరు రామదండు కార్యనిర్వాహక సభ్యులు ఎస్.నూకరాజు, ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.రాజాబాబు తెలిపారు. పురాతన ప్రసిద్ధి చెందిన ఆలయాల రక్షణ కోసం బైక్ ర్యాలీ చేస్తున్నామని వారు తెలిపారు. దెందులూరు శివాలయం నుంచి 200 బైక్‌లతో శైవ క్షేత్రలను దర్శన ర్యాలీ ప్రారంభమవుతుందని రామదండు సభ్యుడు రాజేష్ తులసీదాస్ తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఏలూరు టూ టౌన్/పెదపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూనియన్ గ్రామీణ, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. టాలీ, ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్‌లో శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల వారు స్వయంగా కానీ, ఆన్‌లైన్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. నెలరోజుల పాటు సాగే శిక్షణలో ఉచిత వసతి భోజన సౌకర్యాలు కల్పిస్తారు. 10వ తరగతి ఆ పైన చదివి 45 ఏళ్ల లోపు వారు అర్హులు. బాల బాలికలకు వేరు వేరు హాస్టల్ సౌకర్యం కల్పిస్తారు. ఇతర వివరాలకు 95027 23561, 90140 40780లలో సంప్రదించాలన్నారు. లేదా స్వయంగా దులని ఉపాధి శిక్షణ కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలన్నారు.

22న మందకృష్ణ మాదిగ రాక

టినరసాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు అనంతరం మొదటిసారిగా ఏలూరు జిల్లాకు మంద కృష్ణ మాదిగ రాబోతున్నారని ప్రతి గ్రామం నుంచి యువకులు, విద్యార్థులు, మహిళలు, పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నేత సిద్దూ మాదిగ పిలుపునిచ్చారు. మక్కినవారిగూడెంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి బిగాగూడార్ మాదిగ అధ్యక్షత వహించారు. సిద్దు మాదిగ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు ముమ్మరంగా జరగాలని గ్రామ కమిటీ నిర్మాణం, మండల కమిటీ నిర్మాణం వేగవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఏకాంతారావు, సిహెచ్.వెంకటేశ్వ, విశ్వపావరం మాదిగ పాల్గొన్నారు.

'పది' పరీక్ష ఫీజు గడువు పెంచాలి

ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : 'అపార్' డేటా నమోదులో ఎదురవుతున్న ఆధార్ సవరణలు, పుట్టిన తేదీల్లో సవరణల సమస్యలను ఎదుర్కొంటున్నందున పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరిగా ఆధార్ వివరాలతో సంబంధం లేకుండా పాఠశాల రికార్డుల ఆధారంగా ఫీజు చెల్లించే వెసులుబాటు కల్పించాలన్నారు.

చిన్న పిల్లలతో భిక్షాటన నేరం

పెదవేగి నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : చిన్న పిల్లలతో భిక్షాటన చేయించడం నేరమని డీసీపీవో డాక్టర్ సూర్య చక్రవేణి అన్నారు. మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా పెదవేగి మండలం సూర్యాపేటలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. సర్పంచ్ శ్రీరామమూర్తి, స్కూల్ టీచర్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

కొప్పుల వెలమ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాస్‌కు అభినందనలు



ఉంగుటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నామినేట్ అయిన జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శ్రీనివాస్‌ను పలువురు గురువారం అభినందించారు. కైకరం గ్రామ సర్పంచ్ తో పాటు పార్టీ శ్రేణులు ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

దెందులూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 104 అంబులెన్స్ డ్రైవర్లు సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని 104 ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర నాయకులు ఎం.భరత్, డీఈవో నాగబాబు డిమాండ్ చేశారు. గోపన్నపాలెంలోని అంబేడ్కర్ విగ్రహానికి తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలంటూ గురువారం వినతిపత్రం అందజేశారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.25 లక్షల సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగను జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ నేరస్తుడి వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబర్ 28వ తేదీన జంగా రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో పల్సర్ మోటారు సైకిల్ అపహరణకు గురి కావ డంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. వారికి వచ్చిన సమాచారంతో గాలింపు చేపట్టారు. కామవరపుకోట మండలం పాతకొండగూడెం గ్రామానికి చెందిన అంతర్ రాష్ట్ర నేరస్తుడు చీకట్ల సతీష్ అలియాస్ పండును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి జంగారెడ్డిగూడె ంలో తస్కరించబడిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ నెల 2వ తేదీన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగి పాడు గ్రామంలో ఒక ఇంటిలోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించి ఇద్దరు మహిళ లను ఇనుపరాడ్‌లతో కొట్టి ఆ ఇంట్లో నుంచి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు నగదు అపహరించు కుపోయారు. ఆ నేరం కూడా చీకట్ల సతీష్ చేసినట్లుగా పోలీస్ విచారణలో వెల్లడై ంది. అతని నుంచి పల్సర్ మోటారు సైకిల్, సాగిపాడులో రోబరీ కేసులో అపహరించబడిన బంగారపు వస్తువు లు మొత్తం నలభైఏడున్నర కాసులు, వెండి వస్తువులు నాలుగు కేజీల 150 గ్రాము లతో పాటు 2,46,150 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 25లక్షల రూపాయల విలువైన చోరీ సొత్తును రికవరీ చేయడం జరిగిందని చెప్పారు. ఈనేరస్తుడిని అరెస్టు చేయ డంలో గణపవరం సీఐ ఎంవి సుభాష్, ఏలూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ బోణం ఆది ప్రసాద్, జంగారెడ్డిగూడెం ఎస్ఐ షేక్ జబీర్, ఐడీ పార్టీ ఏఎస్ఐ ఎంవతి సంపత్, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎస్‌కె షాజహాన్, ఏలూరు సీసీఎస్ కానిస్టేబుళ్ళు నాగరాజు, రజనీ కుమార్‌లు సహకరించారని ఎస్పీ వీరందని అభినందించి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను ఎస్పీ అందించారు.

నిరుపయోగంగా.. ఆక్వా ల్యాబ్

» సిబ్బంది కొరత » రైతులకు అందని సేవలు » ప్రైవేటు ల్యాబ్‌లే దిక్కు » కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం వృథా



ఏలూరు టూటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్ధాలుగా రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే రొయ్యలు, చేపల సాగులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాదే అగ్రస్థానం. రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడుతూ కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న రంగాల్లో ఆక్వా పరిశ్రమ అత్యంత ప్రధాన మైంది. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన అధిక ఉత్పత్తులు సాధించడం కోసం ఆక్వా రైతుల సౌకర్యార్థం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆధునిక పరికరా లతో ఆక్వా ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ఏలూరు, ఆకివీ డు, భీమవరంలో ఒక్కో ల్యాబ్‌ను రూ.80 లక్షలతో ఏర్పాటు చేసి వాటిలో రూ.40వేలు చొప్పున అత్యాధునిక పరికరాలను అందుబా టులోకి తీసుకొచ్చింది. ఈ ల్యాబ్‌లు రైతులకు ఎంతో ఉపయోగపడేవి. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇవి నిర్వీర్యం అయ్యాయి. ఆక్వా పరిశ్రమను అంతగా పట్టించుకోకపోవ డంతో ల్యాబ్‌లు నిరుపయో గంగా మారాయి. ఒక్కో ల్యాబ్‌లో నిరంతరం ఫిషరీస్ డెవలప్ మెంట్ అధికారి (ఎఫ్‌డీవో), నిపుణత కలిగిన ఇద్దరు ఉండాలి. కానీ ల్యాబ్‌ల్లో ఒక్కరు కూడా కనిపించడం లేదు. జిల్లా నలుమూలాల నుంచి మట్టి, నీటిని పరీక్షల తీసు కొస్తే తీరా అక్కడ పరీక్షలు చేసేవారు ఉండటం లేదు. ప్రైవేటు ఆక్వా ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నా రు. ఇదే అదనుగా ప్రైవేటు ల్యాబ్ యజమా నులు ఇష్టాను సారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇదికాక 2017లో టీడీపీ ప్రభుత్వం రూ.25 లక్షలతో మొబైల్ ల్యాబ్ ప్రారంభించింది. ఈ మొబైల్ ల్యాబ్ ప్రతి రోజు ఒక ఏరియాను ఎంచుకుని అక్కడ చేపల చెరువుల వద్దకు వెళ్లి నీరు, మట్టి పరీక్షలు నిర్వహించి అవసర మైన మందు లను సూచించి, సలహాలు ఇచ్చేవారు. ఆ మొబైల్ ల్యాబ్‌ను కూడా వైసీపీ ప్రభుత్వం మూలన పడేసింది. కూటమి ప్రభుత్వం ఆక్వా ల్యాబ్‌లను మళ్లీ పునరు ద్ధరించాలని, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, మొబైల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని రైతులు కోరుకుంటున్నారు.

ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలు

సాధారణ నీటి పరీక్షలు, అమోనియా నైట్రేట్, ఫాస్పేట్, ఐరన్, క్లోరిన్ లాంటి పరీక్షలు, మట్టి పరీక్షల్లో నత్రజని, భాస్వరం తదితర పరీక్షలు, బ్యాక్టీరియా పరీక్షలు, మేతపోషక విలువలైన ప్రొటీన్, కొవ్వులు, ఫైబర్, తేమ, బూడిద, కార్బోహైడ్రేట్ లాంటి పరీక్షలు నిర్వహిస్తారు. చేపలపై తాటాకు తెగులు, తెల్లమచ్చలు, రెడ్ డిసీజ్, సంకుజలగ, సంకుపూత, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారు. రొయ్యలలో తెల్లమచ్చలు, బ్యాక్టీరియా, ఈహెచ్‌పీ వ్యాధులు, పీసీఆర్ తదితర పరీక్షలు నిర్వహిస్తారు. పీసీఆర్ పరీక్షలకు రూ.800, మైక్రో బయాలజీ పరీక్షలకు రూ.100, సాయిల్ పరీక్షలకు రూ.210, నీటిపరీక్షలకు రూ.100, పోషక విలువల పరీక్షలకు రూ.240 వసూలు చేస్తారు. అయితే పేద రైతులను దృష్టిలో పెట్టుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉచితంగానే పరీక్షలు నిర్వహించింది. ఆపై వైసీపీ ప్రభుత్వం హయాంలో పరీక్షల ఊసే లేకుండా పోయింది.

భూమి దున్నకుండా..

అధిక దిగుబడి

మొక్కజొన్నలో మంచి ఫలితాలు



చాట్రాయి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు భూమి దున్న కుండా మొక్కజొన్న సాగులో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఖరీఫ్ వరి కోత అనంతరం భూమి తేమగా ఉండగానే తాళ్లతో వరసలు పట్టి పుల్లలతో నేలకు రంధ్రాలు చేసి మొక్కజొన్న విత్తనాలు నాటుతున్నారు. మొలక వచ్చిన తరువాత ఎరువులు, సస్యరక్షణ, నీటి యాజమాన్యం చేపడుతున్నారు. ఈ విధానంలో ఎకరాకు 35 నుండి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో మండలంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.



దిగుబడి ఎక్కువ

రబీలో దున్నకుండా మొక్కజొన్న సాగుకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతుంది. దిగుబడి బాగుంటుంది. ఖరీఫ్ వరి సాగులో పెట్టుబడి చేతికి వచ్చినా, మొక్కజొన్నలో లాభాలతో ఊరట పొందుతున్నాం.

మంచిన పూర్ణచంద్రరావు, కోటపాడు



దున్నకుంటే లాభాలు

ఈ విధానంలో మొక్కజొన్న సాగుతో అనేక లాభాలు ఉన్నాయి. దుక్కి ఖర్చు ఎకరాకు రూ 4 వేలు వరకు ఆదా. కూలీల ఖర్చు, నీటి వినియోగం తగ్గుతుంది. పంట త్వరగా కోతకు వస్తుంది.

బి.శివశంకర్, ఏవో చాట్రాయి

సేంద్రియ సాగు

రైతుకు లాభం



కలిదిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో పలువురు రైతులు సేంద్రియ సాగుతో లాభాలు ఆర్జిస్తున్నారు. పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువు, వేప పిండి, జీవామృతంతో సాగు చేసి అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెడితే రూ.30 వేల ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు. బ్లాక్ రైస్, చింతలూరి సన్నాలు, మైసూరు మల్లిక జీరా సాంబ రకాలకు మంచి డిమాండ్ ఉంది. కిలో రైస్ రూ.120 వరకు పలుకుతోంది. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత ప్రకృతి వ్యవసాయం విస్తరించే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.




సబ్సిడీ రుణాలు అందించాలి : అంకెం సీతారాం, రైతు

మూడేళ్లుగా మూడు ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేస్తున్నాం. ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి పోను రూ.30 వేలు ఆదాయం వస్తుంది. కూలీల ఖర్చు అధికంగా అవుతుంది. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తే ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తుంది.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

నూజివీడు సీనియర్ సివిల్‌జడ్జి షేక్ పెదకాశీం.. ఘనంగా బాలల దినోత్సవం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ పెదకాశీం

నూజివీడు/నూజివీడుటౌన్/ఆగిరిపల్లి/ చాట్రాయి/ముసునూరు/కైకలూరు/ ముదినేపల్లి/ మండవల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ద్వారా బాలబాలికలకు విద్యా అవకాశాలను కల్పించిందని నూజివీడు సీనియర్ సివిల్‌జడ్జి షేక్ పెదకాశీం అన్నారు. కోట వారి గూడెం ఉన్నత పాఠశాలలో బాలల దినోత్స వాన్ని పురస్కరించుకుని గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలలు విధిగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలన్నారు. ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే త్రివిధ పాఠశాలలో నిర్వహించిన ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. నేటి బాలలే రేపటి పౌరులు అంటూ చిన్నారులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బాలకోన్నత పాఠశాలలో బాలల హక్కులపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే సమాచారం అందించాలన్నారు. చాట్రాయి మండలంలోని మర్లపాలెం జడ్పీ హైస్కూల్, తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ నాయకుల వేషధారణలతో చిన్నారులు అలరించారు. మర్లపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాయమ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ ఆటల పోటీలు నిర్వహించగా విజేతలకు పూర్వ విద్యార్థి సీహెచ్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ముసునూరు మండలం రమణక్కపేట జడ్పీ పాఠశాల, చిల్లబోయినపల్లి ఎంపీపీ పాఠశాల, గురుకుల బాలికల పాఠశాల, చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహిచారు ఆయా కార్యక్రమాలలో బార్ అసోసియేషన్ కార్యదర్శులు బి.రామ కృష్ణ, మధురవిశంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మీ హెచ్‌ఎంలు సుజాత, పుష్పలత బక్కయ్య, పీవీఎస్ రామకృష్ణారావు, త్రివిధ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, సూపర్‌వైజర్ జి.రాగమయి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీలత, జనసేన నాయకులు బి.వీరస్వామి, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ బాబు పాల్గొన్నారు బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కైకలూరు సీనియర్ న్యాయ సేవాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మీ అన్నారు. కైకలూరు మండలం వింజరం ఎంపీయూపీ స్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల హక్కులపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎంఈవో రమారావు, హెచ్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని ముదినేపల్లి మండలంలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులతో 'బంగారు బాల్యం' ప్రతిజ్ఞ చేయించారు.ఎంఈవో కె.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో పెయ్యేరులో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, వాడవల్లి యూపీ పాఠశాలలో యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు సాయి లక్ష్మి, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కృపాకర్, చినకామనపూడి యూపీ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నెహ్రూ జయంతి సందర్భంగా అయ్యవారిరుద్రవరం ఎంపీపీ పాఠశాలలో బాలల దినోత్సవ కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పులపర్రు ఎంపీపీ పాఠశాలలో పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండవల్లి ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు నివారణలో యువత పాత్ర మీద వ్యాస రచన పోటీలు నిర్వహించగా విజేతలకు బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేశారు.


పెయ్యేరు ఎలిమెంటరీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రజల సమస్యలు పరిష్కరించాలి


ముసునూరులో డీటీ రమణకు వినతపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నూజివీడు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. నూజివీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర సన ప్రదర్శన నిర్వహించారు. పెంచిన కరెంటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని విరమించుకోవాలని నూ తన విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాపారావు, పద్మాంజలి, ప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● ముసునూరు : ప్రజల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యావర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ముసునూరు మెయిన్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేసి, ఆందోళన నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కేవీ రమణకు వినతపత్రం అందజేశారు. రాజు మాట్లాడుతూ నిత్యావసర వస్తుల ధరలను నియంత్రించాలని, కరెంట్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, ఉచిత ఇసుక విధనాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు కొడవలి శ్రీనివాసరావు, కంచర్ల దుర్గారావు, పోట్రు శ్రీను, గొల్లపల్లి మధు, పంచికల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

● మండవల్లి : ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండవల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సీపీఎం కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అధిక ధరలు తగ్గించాలని, ఇళ్ల స్థలాలు భూముల సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఎం కార్యకర్తలు నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగనపూడి ఫీల్డ్ లేబర్ సొసైటీ దళితుల భూసమస్యను పరిష్కరించాలని, మండవల్లిలో పేదల ఇళ్ల స్థలాలు పూడిక చేయాల న్నారు. అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మూడు సెంట్లు ఇళ్ళ స్థలం ఇవ్వాలని కోరారు.

● కలిదిండి : కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని, నిత్యావసరాల ధరలను నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీలకు ఎన్ఆర్ఐ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఆగిరిపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ విద్యార్థులు ఆర్.అజయ్, ఒల్లు వంశీసాగర్ జూడో పోటీలకు ఎంపికయ్యాడని ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌతు గురవారం తెలిపారు. మధ్య ప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో ఈ నెల 25న జరగ నున్న ఐఎన్‌సీటీయూ యూనివర్శిటీ నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నాగభాస్కర్, ఏవో నూతలపాటి మాధవరావు, ఎకనామిక్ డైరెక్టర్ జి.రోశయ్య వీరిని అభినందించారు.

బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేద్దాం


సమావేశంలో బీజేపీ కార్యకర్తలు

చాట్రాయి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బూత్ కమిటీల ఏర్పాటు ద్వారా బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయటమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జిల్లా బీజేపీ నాయకుడు, ఆర్‌వో ఎం.రాజశేఖర్ అన్నారు. చాట్రాయిలో సీనియర్ నాయకుడు జి.సంజీవరెడ్డి నివాసంలో గురువారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. మండల బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు రాజా, గోపి, ఏఆర్వోలు చెన్నారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : మండలం బీజేపీ కార్యాలయంలో నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కేరంగారావు సూచనలతో పార్టీ సంస్థాగత మండల, బూతు స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో బలమైన కమిటీలు వేసుకుని పార్టీ సంస్థాగత నిర్మాణానికి కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంతా కష్టించి పని చేయాలన్నారు. మండల అధ్యక్షుడు కె.బాబురావు, శేషగిరి, ఎం.వెంకటేశ్వరరావు, రెడ్డి రామారావు, షేక్ సలీంబాషా పాల్గొన్నారు.


గొల్లపల్లిలో గ్రంథాలయ వారోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


ముదినేపల్లిలో పోస్టర్‌ను విడుదల చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న కొడాలి వినోద్, సర్పంచ్ కైకమ్మ

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

నూజివీడు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాషా పరిజ్ఞానం గ్రంథాలయాల ద్వారానే సాధ్యమని గొల్లపల్లి గ్రంథాలయ అధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లి గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా హిందీ బాష పరిజ్ఞానాన్ని పొందాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈకార్యక్రమంలో గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయని దుర్గా మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఆగిరిపల్లి శాఖ గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి సర్పంచ్ చౌటుపల్లి లక్ష్మివిక్టర్ పాల్గొని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 1 సర్వేశ్వరరావు, ఎంఈవో 2 ఆనంద్‌కుమార్, స్కూల్ టీచర్స్ గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరుగుతాయని ప్రతిరోజు విద్యార్థిని, విద్యార్థులకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించబడుతాయని గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావు తెలిపారు.

● చాట్రాయి : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు వీటికి వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చనుబండ శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు పత్రికలు చదివితే జ్ఞానవంతులుగా తయారై చదువులోను జీవితంలోను ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని అన్నారు. దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు మారేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ముసునూరు : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించే భాండాగారాలని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రముఖులు ఉప్పలపాటి గణేష్, కంచర్ల రాంబాబు, సచివాలయ కార్యాదర్శి సుకుమార్‌లు అన్నారు. గురువారం గోపవరం, ముసునూరు శాఖ గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. తొలుత అయ్యంకి వెంకటరమణయ్య, నెహ్రూ చిత్రపటాలకు అతిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్‌చేసి వారోత్సవాలను ప్రారంభించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. చాచా నెహ్రూకు బాలలతో ఉన్న అనుబంధాన్ని, ఇష్టాన్ని వివరించారు. అనంతరం గ్రంథాలయాల అధికారులు సునీల్‌కుమార్, టి.రాజేశ్వరిల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు టి.వరప్రసాద్,టి.ప్రసాద్, ఎం.అనురాధ, కాంత్రికిరణ్‌ల పర్యవేక్షణలో సబ్ జూనియర్ విభాగంలో చిత్రలేఖనం, నీతికథలు వ్రాయటం పోటీలను నిర్వహించారు.

● ముదినేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలను సద్వినియోగించుకుని పుస్తక పఠనంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ అన్నారు. ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో గురువారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, గౌతం హైస్కూల్ టీచర్ కొత్తూరు వెంకట సుబ్బారావు, గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి పాల్గొన్నారు. గురజ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా గ్రంథాలయాధికారిణి ఝాన్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

● కలిదిండి : కలిదిండి మండలం కోరుకొల్లులో గ్రంథాలయ వారోత్సవాలను జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనక దుర్గ ప్రారంభించారు. జవహర్ లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకటరమ ణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి రాఘవులు, బట్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు. కలిదిండి శాఖలో గ్రంథాలయ వారోత్సవాలను రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, గోపాలకృష్ణలు ప్రారంభించారు. గ్రంథాలయాధికారి జె.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కైకలూరు : విద్యార్థులకు గ్రంథాలయాలు విద్యా బాంఢాగారాలని సాహితీ మిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకటనారాయణ అన్నారు. కైకలూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచ్ డీఎం నవరత్నకుమారి ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి కె. శ్రీనివాస్, న్యాయవాది ఆర్.రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

● మండవల్లి : విద్యార్థుల జ్ఞాన సంపదకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ ఎస్. విజయకుమార్, ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ కె.జ్యోతి ప్రసాద్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయ వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్. భాస్కరరావు, రిటైర్డ్ హెచ్‌ఎం కె.సూర్యారావు, గ్రంథాలయ అధికారిణి షేక్ పర్వీనల చేతుల మీదుగా పోస్టర్‌ను విడుదల చేశారు.

విజయవాడలో జనవరి 5న హైందవ శంఖారావం బహిరంగ సభ

మండవల్లి,నవంబరు14(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వ ర్యంలో జనవరి 5న విజయవాడలో చేపట్టిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను ప్రతి హిందువు జయప్రదం చేయాలని హైందవ శంఖారావం విభాగ్ నాయకుడు కోనేరు దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. లోకుమూడి దత్తాశ్రమంలో గురువారం సాయంత్రం హైందవ శంఖారావంపై సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ నాయకులు వీరమాచినేని రంగప్రసాద్, హైందవ శంఖారావం జిల్లా ప్రముఖ్ వంశీ, కైకలూరు ఖండ కన్వీనర్ వెంకటేశ్వరరావు, బీహెచ్‌పీ ఏలూరు జిల్లా కార్యదర్శి గడ్డం నాగరాజు, బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కృష్ణప్రసాద్, కైకలూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జి వి. విష్ణు, సంఘ్ పరివార్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శోభనాచలుని కల్యాణం



ఆగిరిపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎగువ సన్నిధిలో గల స్వయం వ్యక్త లక్ష్మీనరసింహ స్వామి వారికి విశేషాలంకరణ పంచా మృతాభిషేకం, తిరుకల్యాణం వైభ వంగా నిర్వహించారు. ఉభయ దాతలుగా యండూరి చం ద్రశేఖర్‌రావు, మిథున్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సత్యనారాయణ

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

ఈవోపీఆర్డీ సత్యనారాయణ

ముసునూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను తాయారు చేయాలని ఈవోపీఆర్డీ బి.ఏ. సత్యనారాయణ అన్నారు. 2025-26 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసే విధానాన్ని ఈవోపీఆర్డీ వివరించారు. గ్రామస్థాయిలో ఉన్న 10 శాఖల అధికారులు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సీసీరోడ్లు, తాగునీరు, వ్యవసాయం, వెటనరీ తదితర వాటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డి.ఛాయాదేవి, సీనియర్ అసిస్టెంట్ నగ్గూర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కైకలూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): రహదారి వెంబడి అక్రమంగా అధిక దరలకు మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ గురువారం తెలిపారు. కైకలూరు వెలమపేటకు చెందిన ముద్రబోయిన లక్ష్మణ మద్యం సీసాలను ఫైర్‌స్టేషన్ రోడ్డులో నిలబడి పాలిథీన్ కవర్‌లో రూ.20 అధిక దరతో విక్రయిస్తున్నాడు. టౌన్ ఎస్ఐ వెంకట కుమార్ సిబ్బందితో దాడి చేసి అరెస్టు చేసి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకు న్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి 104 సిబ్బంది వినతి

ముదినేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు 104 వాహనాల సిబ్బంది చేపట్టిన ఉద్యమంలో భాగంగా గురువారం ముదినేపల్లి మండలంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మండలంలోని 104 వాహనం డ్రైవర్ వలీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ దామోదర్ ముదినేపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద తమ డిమాండ్లతో కూడిన మెమోరాండంను ఉంచారు.